

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE


సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 115 | ఎడిటర్ : బరిగెల శివ | గురువారం 26, మార్చి 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్



డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

# కరువు కాలంలో.. కష్టాలు !



## విపత్తు కాలం ఉధృతం

## దేశాన్ని పట్టిపీడిస్తున్న కరువు

- పన్నుల భారం అంతా మోసేది పేదలే
- గ్యాస్ సిలిండర్ బాధలు పేదలకే
- సన్న కారు వ్యాపారస్తులు చిన్నబోతున్నారు
- దేశంలో విచ్చలవిడిగా పెరిగిపోతున్న విపత్తు కాలాలు
- బగ్గు మంటున్న గ్యాస్ సిలిండర్ల ధరలు
- దేశంలో ప్రభుత్వాలు ప్రజలను పాలిస్తున్నాయా నటిస్తున్నాయా
- కేంద్ర ప్రభుత్వానికి ప్రజలను అరిగోసపెట్టడం చాలా ఇష్టం
- ప్రజల భవిష్యత్తుపై దెబ్బ కొడుతున్న కరువుకాలాలు
- పేద ప్రజలను కోల్కోలేకుండా చేస్తున్నాయి
- డాక్టర్ బరిగెల శివ

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**


దేశంలో కరువు కాలాలు ప్రజలను భయాందోళనలకు నెట్టేస్తున్నాయని డాక్టర్ బరిగెల శివ బాధ వ్యక్తం చేశారు. కష్ట కాలాలు పునరావృతం అవుతున్న సందర్భాల్లో ప్రభుత్వాలు దేశ ప్రజలకు కావాల్సిన సౌకర్యాలను సదుపాయాలను నిత్యవసరాలను ముందస్తుగా సిద్ధపాటు చేసుకోవడంలో కావలసిన చర్యలు చేపట్టాల్సి ఉంటుండగా నోట్ల మార్పిడి మొదలుకొని కరోనా పరిస్థితులను తట్టుకొని జీఎస్టీ భారాలను మోస్తూ మరోవైపు ఆర్థికపరమైన అప్పులను పేద ప్రజలపై భారాలను మోపుతున్న సందర్భాలలో మరొకసారి గ్యాస్ సిలిండర్ బాధలు పేదవాడిపై పెద్ద భారాన్ని మోపాయని దానివల్ల చిన్న కారు వ్యాపారస్తులు హోటల్స్ నడుపుకునే వ్యక్తులు ఎన్నో రకాలుగా మదన పడుతున్నారని గుర్తు చేశారు. దేశ ప్రజలను విపత్తు కాలాలు వెంటాడుతూనే ఉంటుండగా దేశ ప్రజల రక్షణ కొరకు ప్రభుత్వాలు ఆయా రాష్ట్రాలను సమన్వయ పరచడంలో గాని మేల్కొల్పడంలో గాని ప్రజాసేవకు కట్టుబడి పని చేయాలని ఆదేశించడంలో గాని మొద్దుబారినతనాన్ని ప్రదర్శిస్తుందని తీవ్రంగా విమర్శించారు. ఏ రాష్ట్రంలో చూసిన రాజకీయ నాయకులు కష్టకాలంలో మాత్రమే ప్రజలకు సహాయకరంగా అండగా నిలువలేక పోతున్నారని తీవ్రంగా దుయ్యపడ్డారు. రాజకీయ పదవులు అనుభవించే కాడ ఎలాంటి సందేహం లేకుండా కావాల్సినన్ని

## హైదరాబాద్‌లో ఘోరం..

**ప్రియుడి కోసం కన్నతల్లి హత్య..**
**ఇంట్లోనే పూడ్చిపెట్టి 10 నెలలుగా నాటకం!**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్ నగరంలో పది నెలల క్రితం జరిగిన ఓ మహిళ హత్య కేసు మిస్టరీ వీడింది. ప్రేమకు అడ్డుచెబుతోందన్న కారణంతో కన్నతల్లినే ఓ కూతురు తన ప్రియుడితో కలిసి హత్య చేసి, మృతదేహాన్ని ఇంట్లోనే పూడ్చిపెట్టిన దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సికింద్రాబాద్ జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కౌకూర్ భరత్‌నగర్‌లో ఈ దారుణం చోటుచేసుకుంది. ఓ బైక్ ఆధారంగా పోలీసులు ఈ కేసును ఛేదించారు. వివరాల్లోకి వెళితే... భరత్‌నగర్‌కు చెందిన అంజు అనే మహిళ పది నెలల క్రితం అదృశ్యమైంది. దీంతో ఆమె పెద్ద కుమార్తె బొల్లారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు - మిగతా 2లో..



## ఎస్‌బీఐ ఖాతాదారులకు పండుగే పండుగ !

ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్ల భారీ పెంపు!!
ఎస్‌బీఐ బల్క్ టర్మ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లు పెంపు
రూ. 3 కోట్ల కంటే ఎక్కువ డిపాజిట్లపై వడ్డీ రేట్ల సవరణ
సాధారణ కస్టమర్ల కంటే సీనియర్ సిటిజన్లకు అధిక వడ్డీ
కొత్త, రెన్యువల్ డిపాజిట్లకు మాత్రమే వర్తించే కొత్త వడ్డీ రేట్లు





6

## గ్రామ ప్రథమ పౌరుడి దాష్టికం 8

యువత భవిష్యత్తుతో చెలగాటం!
మార్గం చూపాల్సిన సర్పంచే మద్యం దందాకు అడ్డాగా మారాడా?
గ్రామ ప్రజల్లో కట్టలు తెచ్చుకుంటున్న ఆగ్రహం

## క్రైస్తవ మతంలోకి మారితే ఎస్సీ హోదా రద్దే

- సుప్రీంకోర్టు కీలక తీర్పు



6

## రాజకీయాలను పక్కనపెట్టి..

**భట్టి విక్రమార్కతో కేటీఆర్ భేటీ**

**సిరిసిల్ల, జై భీమ్ న్యూస్**



సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను పట్టిపీడిస్తున్న సంక్షోభం నుంచి నేతన్నలను గట్టెక్కించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చొరవ తీసుకున్నారు. ఈరోజు సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసిన ఆయన, సిరిసిల్ల నియోజకవర్గంలోని పవర్ లూమ్ పరిశ్రమ ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను వివరించారు. రాజకీయాలకు అతీతంగా జరిగిన ఈ భేటీ అందరినీ ఆకట్టుకుంటోంది. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై ఉన్న సుమారు రూ. 38 కోట్ల విద్యుత్ బకాయిలు, పేరుకుపోయిన బ్యాక్ బిల్లింగ్, సర్‌ఛార్జ్‌లను తక్షణమే మాఫీ చేయాలని కేటీఆర్ ఈ సందర్భంగా డిప్యూటీ సీఎంను కోరారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్న విధంగానే పరిశ్రమకు నిరంతర విద్యుత్ సబ్సిడీ ప్రయోజనాలు అందేలా చూడాలని, పాత బకాయిలతో సంబంధం లేకుండా నేతన్నలకు వెసులుబాటు కల్పించాలని విన్నవించారు. పరిశ్రమ సంక్షోభంలో ఉండటంతో నేతన్నలు మళ్ళీ ఆత్మహత్యల బాట పట్టే ప్రమాదం ఉందని, వారికి తక్షణమే భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉందని కేటీఆర్ తెలిపారు. కేటీఆర్ వివరించిన సమస్యలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. నేతన్నల సంక్షేమం ప్రభుత్వ ప్రాధాన్యత అని, విద్యుత్ బకాయిల అంశాన్ని లోతుగా పరిశీలించి కార్మికులకు మేలు జరిగేలా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంక్షోభ నివారణకు అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# హైదరాబాద్‌లో ఘోరం..

మొదటి పేజీ తరువాయి

చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పది నెలలుగా దర్యాప్తు చేస్తున్నా కేసు కొలిక్కి రాకపోవడంతో పోలీసులు దీన్ని సవాలుగా తీసుకున్నారు. ఈ క్రమంలో అంజు చిన్న కుమార్తె ఇషిక, ఆమె ప్రియుడు మౌంటీరాజ్‌పై అనుమానంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారు వాడిన బైక్ ఈ కేసులో కీలక ఆధారంగా మారినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల విచారణలో ఇషిక అసలు నిజాన్ని అంగీకరించింది. ఇషిక, మౌంటీరాజ్ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారని, సహజీవనం చేయాలని నిర్ణయించుకున్నారని తెలిసింది. అయితే, వీరి ప్రేమ వ్యవహారాన్ని తల్లి అంజు తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రియుడిని వదిలేయాలని కూతురిని మందలించింది. దీంతో తమ ప్రేమకు అడ్డుగా ఉందని భావించి, తల్లిని హతమార్చాలని ఇషిక, మౌంటీరాజ్ నిర్ణయించుకున్నారు. పథకం ప్రకారం అంజును దారుణంగా హత్య చేసి, ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని అదే ఇంట్లో గొయ్యి తీసి పూడ్చిపెట్టారు. ఆ తర్వాత ఏమీ తెలియనట్లు నటిస్తూ, తన అక్కతో కలిసి తల్లి కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేయించారు. ఈ దారుణ ఘటన బయటపడటంతో పోలీసులు ఇషిక, మౌంటీరాజ్‌లను అరెస్ట్ చేశారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు మెజిస్ట్రేట్ సమక్షంలో మృతదేహాన్ని వెలికితీసే పనులు చేపట్టారు. కేవలం నాలుగు రోజుల పరిచయమైన ప్రియుడి కోసం కన్నతల్లిని కూతురే కిరాతకంగా చంపడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# 40 ఏళ్ల అనుబంధానికి స్వస్తి..

### రేవంత్ పై ధ్వజమెత్తుతూ కాంగ్రెస్‌కు జీవన్ రెడ్డి రాజీనామా

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. జగిత్యాలలో కార్యకర్తల సమక్షంలో తన రాజీనామా లేఖను విడుదల చేసిన ఆయన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పార్టీ హైకమాండ్ తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత 20 నెలలుగా పార్టీలో తీవ్రమైన మానసిక క్షోభకు గురవుతున్నానని, గౌరవం లేని చోట ఉండలేకే రాజీనామా నిర్ణయం తీసుకున్నానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ విధానాలకు విరుద్ధంగా తెలంగాణలో ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను పార్టీలోకి తీసుకోవడం, ఆయనకు ప్రాధాన్యత ఇవ్వడంపై జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పదేళ్ల పాటు కష్టపడి పార్టీని అధికారంలోకి తెచ్చిన అసలైన కార్యకర్తలను పక్కన పెట్టి, ఇన్నాళ్లూ తమను ఇబ్బంది పెట్టిన వారికే పెద్దపీట వేస్తున్నారని ధ్వజమెత్తారు. తన వెన్నంటి ఉన్న కీలక నాయకుడు చనిపోతే సీఎం కనీసం పరామర్శించలేదని, రేవంత్ రెడ్డి తనకు అండగా నిలబడలేదని ఆరోపించారు. ఇకపై రేవంత్ రెడ్డి విధానాలపైనే తన పోరాటం ఉంటుందని ప్రకటించారు. మరోవైపు, జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ చివరి వరకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. జీవన్ రెడ్డి తన నిర్ణయానికే కట్టుబడ్డారు. జగిత్యాల నియోజకవర్గంలో జీవన్ రెడ్డికి ఉన్న బలమైన కేడర్ ఇప్పుడు ఆయన వెంటే నడిచే అవకాశం ఉంది.

# హైదరాబాద్‌లో వడగళ్ల వాన...

### రంగారెడ్డి జిల్లాకు రెడ్ అలర్ట్



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్?లో పలుచోట్ల భారీ వర్షం కురుస్తోంది. వనస్థలిపురం, హయత్ నగర్, గాయత్రీనగర్, అబ్దుల్లాపూర్‌మెట్ తదితర ప్రాంతాల్లో వడగళ్ల వాన కురిసింది. ఒక్కసారిగా వాతావరణం మారిపోవడంతో ప్రజలు ఎండ వేడిమి నుంచి కాస్త ఉపశమనం పొందారు. ఘట్‌కేసర్, అన్నోజిగూడ, నారపల్లిలో భారీ వర్షం కురుస్తోంది. రంగారెడ్డి జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షం కురిసే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. నారాయణపేట, వికారాబాద్, హైదరాబాద్, మేడ్చల్, మంచిర్యాల జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. హైదరాబాద్‌లో పలుచోట్ల ఈరోజు మధ్యాహ్నం వర్షం కురిసింది. ఆ తర్వాత కాస్త తెరిపిచ్చినప్పటికీ, సాయంత్రం మళ్లీ భారీ వర్షం ప్రారంభమైంది.

# ధూళిపాళ్ల కుమార్తె వివాహం..

## హాజరైన సీఎం చంద్రబాబు

**గుంటూరు, జై భీమ్ న్యూస్**

తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ కుమార్తె వివాహ వేడుక గుంటూరులో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. గుంటూరులోని శ్రీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ పెళ్లి వేడుకలో పాల్గొన్న సీఎం చంద్రబాబు.. వధూవరులు నాగసాయి వైదీప్తి, కెవిన్ రామ్‌లకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. వారి వైవాహిక జీవితం ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ వివాహ వేడుకకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా హాజరుకావడం విశేషం. ఇదే వేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ కలిసి సందడి చేశారు. ఇద్దరు నేతలు ఒకే వేదికపై కనిపించడంతో కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణ నెలకొంది. ఈ పెళ్లి వేడుక పలువురు రాజకీయ ప్రముఖుల కలయికకు వేదికగా నిలిచింది.

# కరువు కాలంలో కష్టాలు

మొదటి పేజీ తరువాయి

పదవులను తీసుకుంటున్నారని ప్రజాసేవ అనేసరికి ముఖం చాటేస్తూ దూరంపోతున్నారని మనోవేదన చెందారు.అసలు కైతే దేశంలో విపత్తు కాలాలను ప్రభుత్వాలు సృష్టిస్తున్నాయా కాలపరిమితులుగా వాతావరణాలు సృష్టిస్తున్నాయా తెలియదు కానీ మొత్తం మీదుగా ప్రభుత్వాల చేతిలో అధికారం కలగని అధికార బలాన్ని అధికార దుర్వినియోగాన్ని ప్రతి పేదవాడి పై రుద్దడానికి రాజకీయ ఎత్తుపల్లాలను సృష్టిస్తుండటమే కాకుండా రాజకీయ కష్టకాలాలను ప్రభుత్వాలే తయారు చేస్తున్నాయని తీవ్రంగా మండిపడ్డారు.ప్రస్తుతం దేశంలో గ్యాస్ సిలిండర్ కొరత తీవ్రంగా పెరిగిపోయిందని అన్ని రాష్ట్రాల్లో పేద ప్రజలు ప్రభుత్వాలపై విరుచుకుపడుతూ ఎక్కడ లేని వ్యతిరేకతను కనపరుస్తుండగా కేంద్ర ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టడంలో ఎక్కడ ముందుకు రావడం లేదని ఆవేదన చెందారు.పక్క దేశాలను కారణంగా చూపెడుతూ భారతదేశంలో సమస్యలు సృష్టించబడటం అనేది 12 సంవత్సరాల కాలంలో లెక్కలేనని సార్లు పెరిగిపోయిందన్నారు.గ్యాస్ సిలిండర్ కొరత వల్ల దేశంలో అన్ని రాష్ట్రాల్లో పేద ప్రజలు కట్టెల పోయిలు ఉపయోగించుకుంటున్నారని దేశ పరిస్థితి ఇంతలా దిగజారి పోవడానికి కేంద్ర ప్రభుత్వం కష్టకారాలను మందస్తుగా పసిగట్టే దూరదృష్టి లేకపోవడమే ముఖ్య కారణమన్నారు.దేశంలో భయంకరమైన మోసం ఏమిటంటే యుద్ధ ప్రభావం దేశ సరిహద్దులు మూసివేసిందని దేశంలోకి వస్తున్న దిగుమతులు దేశం నుండి వెళ్తున్న ఎగుమతులు తగ్గిపోయాయని అందువల్ల దేశంలో గ్యాస్ సిలిండర్ కొరతా ఏర్పడిందని చెబుతున్న ప్రభుత్వాలు సరిహద్దులు మూసి వేయబడుతుండగా రవాణా సౌకర్యాలకు అనుమతులు ఎలా ఏర్పడుతున్నాయంటూ సూటిగా ప్రశ్నించారు.పక్క దేశంలో యుద్ధాలు జరిగితే భారతదేశంపై ప్రభావం పడుతుందని తెలుపుతున్నప్పుడు దేశంలో దాడులు సంభవిస్తున్న ప్రతిసారి పేద ప్రజలను టార్గెట్ చేసుకొని ఇబ్బందులకు గురి చేస్తున్నట్లుగా దేశమంతట రాజకీయ పాలన కొనసాగుతుందని తీవ్రంగా మండిపడ్డారు.దేశంలో ఎలాంటి విపత్తు కాలాలు ఉత్పన్నమైన ఎలాంటి కరువు కాలాలు ఏర్పడ్డ రాజకీయ నాయకుల వ్యాపారాలు గాని రాజకీయ నాయకుల ఆస్తుల పెరుగుదల గాని ఏమాత్రం తగ్గడం లేదనేది పచ్చి నిజమన్నారు.దేశంలో కరువు ఏర్పడ్డ ప్రతిసారి పేద ప్రజలే బాధపడాల్సి వస్తుందని దేశంలోని కరువు అంతా పేద ప్రజలే మోయాల్సి వస్తుందని తీవ్రమైన మనోవేదన చెందారు.ఇతర దేశాల్లో పొందుపరచబడిన నల్లధనాన్ని తీసుకువచ్చి దేశంలోని పేద ప్రజల అకౌంట్లలో జతపరుస్తామని వందలసార్లు చెప్పిన కేంద్ర ప్రభుత్వం 12 సంవత్సరాలలో దేశంలో పేద ప్రజల ఆర్థిక వనరులను ఆర్థిక జీవనాన్ని పూర్తిగా దెబ్బతీస్తుంది అని గుర్తు చేశారు.రాజకీయ ప్రభావం చివరకు ఏ దశకు చేరిపోయిందో ఆలోచన చేయాల్సి వచ్చినప్పుడు పేదోడు పేదోడి లాగానే ఉండాలి తప్ప బుక్కెడు బువ్వ కూడా సంపాదించుకోవడానికి వీలులేదనే దరిద్రపు పరిస్థితులను దేశంలో తయారు చేస్తున్నది మాత్రం పక్కా రాజకీయ పార్టీలేనని రాజకీయ స్వార్థపరులేనని గుర్తు చేశారు.మరోవైపు రాజకీయాలకు సంబంధం లేకుండా ఆర్థికంగా ఎదుగుతున్న వ్యాపారస్తులు పారిశ్రామికవేత్తలు దేశంలోని కరువుకాలాలను పేదలవైపు నెట్టే తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్నారని దేశంలో ఏర్పడుతున్న విపత్తు కాలాలన్ని స్పష్టంగా వెల్లడిస్తున్నాయన్నారు.దేశవ్యాప్తంగా అన్ని పారిశ్రామిక రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు కార్మిక సంఘాలు కష్టకాలంలో కూడా కరువును మర్చిపోయి కడు పేదరికం అనుభవిస్తూ వ్యాపారస్తుల పరిశ్రమల అభివృద్ధికి ప్రాణాలకు తెగించి పనిచేస్తున్నారని అలాంటి దయనీయమైన కాలాల్లో కూడా పేదలపై కార్మికులపై ప్రభుత్వాలకు దయా జాలి కనికరం ఏమాత్రం లేకుండా పోతుందని నిలదీశారు.దేశ ప్రజలు తీవ్రమైన బాధను ఎదుర్కొంటున్న సందర్భాల్లో దేశ నాయకులు ప్రజాసేవను గాలికి వదిలేసి వ్యాపార సేవను పెంపొందిస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.మొత్తం మీదుగా దేశంలో పేదవాడు బ్రతకాలంటేనే వెయ్యి రకాల ప్రశ్నలతో జీవించాల్సి వస్తుందని ఇలాంటి దుస్థితిని తీసుకొస్తున్న ప్రభుత్వాలు ఇంకా పేద ప్రజలపై ఎంతటి భారలతో కూడిన కరువు కాలాలను సృష్టిస్తారో దేశ ప్రజలే గమనించుకోవాలన్నారు.ఒకవైపు దేశంలో తుఫాన్లు భూకంపాలు వాతావరణ ప్రకంపనలు దేశానికి ఆర్థిక నష్టంతో కూడిన భారాన్ని ఏర్పాటు చేస్తుండగా ప్రస్తుతం దాని వంతు రాజకీయ పార్టీలది అయిందని తెలిపారు.ప్రకృతి ప్రభావం వల్ల వాతావరణ ప్రభావం వల్ల ఏర్పడినటువంటి కష్ట కాలాలు విపత్తు కాలాలు కొంతకాలం వరకే ప్రజలపై ఇబ్బంది కరమైన వాతావరణాన్ని కల్పిస్తూ ఆర్థిక నష్టాన్ని సృష్టిస్తుండగా రాజకీయంగా ఏర్పడుతున్న విపత్తులు కష్ట కాలాలు మాత్రం ప్రజలను సంవత్సరాలు...సంవత్సరాలుగా ప్రజలను వేధిస్తూనే ఉన్నాయని గుర్తు చేశారు.చివరగా ప్రజలను బాగుపడనివ్వకుండా పనిచేసుకొనివ్వకుండా సంక్షేమాల పేరు మీద సోమరిపోతులను తయారు చేస్తూ నిజమైన పేదలకు న్యాయం చేయకుండా, సంక్షేమాలు అందించకుండా దేశవ్యాప్తంగా కొరివి రాజకీయాలతో కూడిన రాజకీయ విపత్తు కాలాలను రాజకీయ కష్టకాలాలను ప్రభుత్వాలే తయారు చేసి ప్రజలపై రుద్దుతున్నారని ఏదేమైతేనే మా వ్యాపారాలు మా సంస్థలు బాగుంటే సరిపోతుందని భావించే పద్ధతిలో వ్యాపారస్తులు పారిశ్రామికవేత్తలు ఉంటుండగా మరేమైతేనేం ప్రజలను ఎంతటి మోసం చేసైనా సరే ప్రభుత్వాలను ఏర్పరచుకొని అధికారంలో ఉంటే చాలు అనుకునే పద్ధతిలో ప్రభుత్వాలు ఉంటున్నాయని దీని మొత్తంగా గమనిస్తుండగా ప్రజలను వేధించాలని ఒకవైపు ప్రజలను కష్టాల్లోనికి నెట్టేయాలని మరోవైపు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాళ్ల వాళ్ల రాజకీయ స్వార్థం కోసం పేదరికం అనే కరువు కాలాలను నిర్మిస్తున్నారని అందువల్ల దేశ ప్రజల బ్రతుకులు ఎలా బాగుపడగలవో ఎవరికి అంతుపడడం లేదన్నారు.పలుకుబడి కలిగిన రాజకీయ నేతలు పెడుతున్న ఇబ్బందుల వల్ల పనికి తగ్గ జీతాలు చెల్లించకుండా వేధింపులకు గురి చేస్తున్న వ్యాపారస్తుల వల్ల కార్మికులు గాని పేద ప్రజలు గాని కరువు కాలాలను అంటిపెట్టుకొని జీవించాల్సిందేనంటూ ప్రభుత్వాలు చూపిస్తున్న ప్రత్యక్షపు దోరని ప్రజల జీవితాలను లెక్కలేనంత వెనక్కి నెట్టేస్తుందన్నారు.ఇంతటి ఆర్థిక భారాన్ని ఇంతటి కరువుకాలాలను ఇంతటి కష్ట కాలాన్ని ఇంతటి విపత్తు కాలాలను ఎదుర్కొంటున్న భారతదేశం మాత్రం భరించరాని అప్పుల్లో కూరుకుపోతూ పేద ప్రజలకు కన్నీటిని అప్పులబారన్ని తీర్చే దీనమైన స్థితికి నెట్టివేస్తుందన్నది కష్ట కాలాలను అనుభవిస్తూ జీవిస్తున్న పేద ప్రజలకు మాత్రమే తెలుస్తుందన్నారు.మన మొక్కలమే బాగుపడితే చాలు పక్క వాళ్ళు నాశనమైపోయిన పర్వాలేదు అనే స్థితికి దేశ రాజకీయ నాయకుల మానవత్వం మొద్దుబారి పోయిందని అలాంటి స్వార్థపూరితమైన రాజకీయ వ్యవస్థలు పూర్తిగా నశించాలని కోరారు.

# అందుకే పెట్రోల్ బంకుల్లో 'నో స్టాక్' బోర్డులు: తెలంగాణ మంత్రి

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**



ట్యాంకర్లు సకాలంలో రాకపోవడం వల్లే బంకుల్లో నో స్టాక్ బోర్డులు వెలిశాయని, గృహ అవసరాలకు గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందిలేదని తెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. పెట్రోల్, డీజిల్ లభ్యత విషయంలో ప్రజలు అపోహలను నమ్మవద్దని కోరారు. చమురు కంపెనీలు కూడా సరిపడా నిల్వలు ఉన్నట్లు చెబుతున్నాయని అన్నారు. అసెంబ్లీలో ఆయన మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 2 నెలలకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని మంత్రి తెలిపారు. వదంతుల కారణంగా పెట్రోల్, డీజిల్ ఎక్కువగా కొనుగోలు చేయడంతో బంకుల్లో రద్దీ నెలకొందని అన్నారు. క్యాన్లు, కంటైనర్లలో ఇంధనాన్ని తీసుకువెళ్లడం చట్టవిరుద్ధమని, అలా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గృహ అవసరాలకు గ్యాస్ కొరత లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో హాస్టళు ,, ఆసుపత్రులకు గ్యాస్ కొరత లేకుండా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ నగరంలో 596 పెట్రోల్ బంకులు పూర్తిగా పని చేస్తున్నాయని మంత్రి వెల్లడించారు. ఏ బంకును కూడా మూసివేయడానికి అనుమతించలేదని అన్నారు. కమర్షియల్ సిలిండర్ల విషయంలో కేంద్రంతో మాట్లాడుతున్నట్లు మంత్రి తెలిపారు. చట్టవిరుద్ధంగా నింపిన 2,952 కమర్షియల్ సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు మంత్రి తెలిపారు.

# ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్తె వివాహ వేడుక

### సీఎం రేవంత్ రెడ్డికి సాదర స్వాగతం పలికిన మంత్రి లోకేశ్

**గుంటూరు, జై భీమ్ న్యూస్**



టీడీపీ సీనియర్ నేత, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ కుమార్తె వివాహ వేడుక గుంటూరులో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఏపీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. శ్రీ కన్వెన్షన్‌లో జరిగిన ఈ వేడుకలో ఇరు రాష్ట్రాల నేతలు పక్కపక్కనే కూర్చోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కుటుంబసభ్యులతో కలిసి వివాహానికి హాజరైన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి నారా లోకేశ్ సాదర స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరు నేతలు కలిసి నూతన వధూవరులు నాగసాయి వైదీప్తి, కెవిన్ రామ్‌లను ఆశీర్వదించారు. పుష్పగుచ్ఛం అందించి, వైవాహిక జీవితం ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ వివాహ వేడుకకు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు టీడీపీకి చెందిన ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

# అమరావతి 'ఐకానిక్' టవర్లు రెడీ అవుతున్నాయి..

### డయాగ్రిడ్ టెక్నాలజీతో అద్భుత నిర్మాణం: నారాయణ

**విజయవాడ, జై భీమ్ న్యూస్**



రాజధాని అమరావతిలో రాష్ట్ర స్థాయి అధికారులందరూ ఒకే చోట కొలువుదీరేలా నిర్మిస్తున్న ఐదు ఐకానిక్ టవర్ల పనులు వేగవంతమయ్యాయి. ఈరోజు హెచ్ఓడీ టవర్-3 వద్ద 'కార్నర్ నోడ్' అమర్చే పనులను మంత్రి నారాయణ ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అత్యాధునిక డయాగ్రిడ్ సాంకేతికతతో ఈ భవనాలను నిర్మిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అమరావతి నిర్మాణానికి ప్రజలు చెల్లించే పన్నుల నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయడం లేదని మంత్రి స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు రూపొందించిన ప్రత్యేక ఫైనాన్స్ మోడల్ ద్వారానే ఈ నిధులు సమకూరుతున్నాయని, అమరావతి ఒక 'సెల్ఫ్ ఫైనాన్స్ సిటీ' అని ఆయన గుర్తు చేశారు. గత ఏడాది కురిసిన భారీ వర్షాల వల్ల సుమారు 4 నెలల పాటు పనులకు అంతరాయం కలిగిందని, ఇప్పుడు పనుల వేగాన్ని పెంచామని తెలిపారు. ఐకానిక్ భవనాలతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారుల నివాస సముదాయాల పనులు కూడా తుది దశకు చేరుకున్నాయని వివరించారు. రాయపూడి వద్ద జరిగిన అగ్నిప్రమాదంపై సీఎం ఇప్పటికే సమీక్షించారని, ఒకవేళ ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఈ ప్రమాదానికి పాల్పడి ఉంటే వారిపై కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. ప్రస్తుతం దీనిపై పూర్తిస్థాయి విచారణ జరుగుతోందని చెప్పారు. ఈ టవర్ల నిర్మాణంలో వాడుతున్న డయాగ్రిడ్ టెక్నాలజీ వల్ల భవనానికి లోపల పిల్లర్లు ఉండాల్సిన అవసరం తక్కువగా ఉంటుంది. దీనివల్ల లోపల స్థలం ఎక్కువగా లభిస్తుంది. ఉక్కును త్రిభుజాకారపు గ్రిడ్లుగా అమర్చడం వల్ల భవనానికి అద్భుతమైన పటుత్వంతో పాటు ఒక ఆధునిక లుక్ వస్తుంది.

# చంద్రబాబుకు భయపడొద్దు.. ఆ రోజులు పోయాయి: జగన్

**విజయవాడ, జై భీమ్ న్యూస్**

వైసీపీ అధినేత జగన్ ప్రకాశం జిల్లా అద్దంకి నియోజకవర్గ పార్టీ నేతలతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంపై, ముఖ్యంగా సీఎం చంద్రబాబుపై ఆయన నిప్పులు చెరిగారు. పాలనలో అంతా తనదే అన్నట్టుగా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని, ప్రతి చిన్న విషయంలో 'క్రెడిట్ చోరీ' చేస్తున్నారని మండిపడ్డారు. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ మన హయాంలోనే రాష్ట్రానికి వచ్చిందని, కానీ ఇప్పుడు తన వల్లే వచ్చినట్టుగా చంద్రబాబు 'బిల్డప్' ఇస్తున్నారని జగన్ ఎద్దేవా చేశారు. గూగుల్ విషయంలోనూ ఇదే జరిగిందని, మాటలు కోటలు దాటుతున్నా చేతల్లో ఏమీ లేదని విమర్శించారు. రాబోయే రోజుల్లో పార్టీని సరికొత్తగా తీర్చిదిద్దుతామని, 'జగన్ 2.0'లో కార్యకర్తలకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని హామీ ఇచ్చారు. నేతలెవరూ చంద్రబాబును చూసి భయపడాల్సిన అవసరం లేదని, ఆ రోజులు పోయాయని ధైర్యం చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజన జరగబోతుండటం పార్టీకి మంచి పరిణామమని జగన్ అభిప్రాయపడ్డారు.

# ఘనంగా ప్రతాపరుద్ర దేవుడి జయంతి వేడుకలు





**హన్మకొండ / జై భీమ్ న్యూస్ :**

హనుమకొండ జిల్లాలోని చారిత్రక కట్టడం అయిన రుద్రేశ్వర స్వామి వేయి స్తంభాల దేవాలయ ప్రాంగణంలో కాకతీయ సామ్రాజ్య మహారాజు ప్రతాపరుద్ర దేవుడి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. యువ నాయకుడు దేవర విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు, యువతీ యువకులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించి, అనంతరం ప్రతాపరుద్రుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన వీరత్వం, పరాక్రమం, పరిపాలనా దక్షతను స్మరించుకుంటూ పలువురు నాయకులు ప్రసంగించారు. కాకతీయుల సువర్ణ యుగాన్ని గుర్తుచేసుకుంటూ, ప్రతాపరుద్రుడి చరిత్ర ప్రతి తెలుగు వాడికి గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అల్లుడు విష్ణురెడ్డి , ఇతర ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ, ఎంతో ఘనకీర్తి పొందిన ప్రతాపరుద్రుడి చరిత్రను వెలుగులోకి తీసుకువచ్చి రానున్న తరాలకు ఆదర్శంగా నిలిచేలా ఈ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే ప్రతి డివిజన్‌లో ఇటువంటి ఉత్సవాలు నిర్వహించి ప్రజలకు తమ వారసత్వ సంపదపై అవగాహన కల్పించాలని ఆకాంక్షించారు. విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, కాకతీయులు గొలుసుకట్టు చెరువులు నిర్మించి శతాబ్దాల క్రితమే రైతులకు సాగునీరు, త్రాగునీరు అందేలా అనేక జలాశయాలు నిర్మించారని తెలిపారు. ఆధ్యాత్మికత కోసం దేవాలయాలను నిర్మించి ప్రజలు ప్రశాంతంగా జీవించే విధంగా సమాజాన్ని తీర్చిదిద్దారని అన్నారు. వేయి స్తంభాల దేవాలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేందర్ శర్మ మాట్లాడుతూ, క్రీ.శ. 1296 నుండి 1326 వరకు ప్రతాపరుద్రుడు కాకతీయ సామ్రాజ్యాన్ని పరిపాలించాడని తెలిపారు. ఆయన గొప్ప వీరుడు, పండితుడు, దయాదాక్షిణ్యాలు కలిగిన రాజుగా చరిత్రలో నిలిచాడన్నారు. ఢిల్లీ సుల్తాన్ అల్లావుద్దీన్ ఆధీనంలోని మాలికాఫూర్ సేనపై వీరోచితంగా పోరాడి విజయం సాధించినట్లు వివరించారు. కాకతీయుల కాలంలో సాహిత్యం, వాస్తు, శిల్పకళ, సంగీతం, నృత్యం వంటి రంగాలు విస్తృతంగా అభివృద్ధి చెందాయని తెలిపారు. వరంగల్ కోట, రామప్ప ఆలయం, వేయి స్తంభాల దేవాలయం వంటి అద్భుత నిర్మాణాలు ఆ కాలపు వైభవాన్ని చాటుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 500 మంది యువతీ యువకులకు కాకతీయ చరిత్రపై అవగాహన కల్పించారు. అలాగే టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బుద్ధి రెడ్డి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్లు తోటా వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమాన్, సురేందర్, రజవలి, జక్కుల రవీందర్ యాదవ్, తాడిశెట్టి విద్యాసాగర్, తోట పవన్, కుమార్ యాదవ్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్, సోమయ్య, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# నర్సంపేటలో కలకలం రేపిన తప్పుడు మెడికల్ రిపోర్ట్

**వేద స్కానింగ్ సెంటర్‌పై ప్రజల ఆగ్రహం, చర్యల కోసం డిమాండ్**

**నర్సంపేట / జై భీమ్ న్యూస్ :**

నర్సంపేటలోని ఒక ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్‌లో వెలుగుచూసిన తప్పుడు రిపోర్ట్ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. వైద్య సేవలపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసే విధంగా ఈ ఘటన చోటుచేసుకోవడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. సమాచారం ప్రకారం, వేద స్కానింగ్ సెంటర్లో మైనర్ బాలికకు గర్భవతి అని రిపోర్ట్ ఇవ్వడం వివాదాస్పదమైంది. కుటుంబ సభ్యుల వాదన ప్రకారం, గర్భ నిర్ధారణకు సంబంధించిన కీలక పరీక్షలు సాధారణంగా గైనకాలజిస్టుల పర్యవేక్షణలో నిర్వహించాల్సి ఉండగా, ఇక్కడ రేడియాలజిస్ట్ స్వయంగా ఆ పరీక్షలను నిర్వహించి గర్భధారణగా నిర్ధారించారని ఆరోపిస్తున్నారు. స్థానిక పేషెంట్లు మరియు ప్రజలు కూడా ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ, గైనకాలజీకి సంబంధించిన ప్రత్యేక పరీక్షలను సంబంధిత నిపుణులు మాత్రమే చేయాల్సి ఉండగా, ఈ సెంటర్‌లో విధివిధానాలు పాటించడంలో లోపాలు ఉన్నాయని అభిప్రాయపడుతున్నారు. ఈ రిపోర్ట్‌పై అనుమానం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు అనంతరం వరంగల్లోని ఆసుపత్రిలో మళ్లీ పరీక్షలు చేయించగా, అది గర్భం కాకుండా "బ్యాడ్ టిష్యూస్"గా తేలడం మరింత ఆందోళనకు దారితీసింది. మొదటి రిపోర్ట్ తప్పుడు అని తేలడంతో కుటుంబం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై స్పందించిన కుటుంబ సభ్యులు స్కానింగ్ సెంటర్‌కు వెళ్లి, తప్పుడు సమాచారం ఎందుకు ఇచ్చారంటూ సిబ్బందిని నిలదీశారు. ఈ ఘటన సమయంలో అక్కడికి చేరుకున్న స్థానికులు కూడా సెంటర్ నిర్వహణపై ప్రశ్నలు లేవనెత్తడంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారినా, పెద్దగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని సమాచారం. ఇలాంటి తప్పు వైద్య రిపోర్టులు అమాయక ప్రజలను మానసికంగా, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని నర్సంపేట ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మైనర్ బాలికకు సంబంధించిన ఇలాంటి సున్నితమైన విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించడం బాధాకరమని వారు పేర్కొంటున్నారు. ఈ ఘటనపై వెంటనే స్పందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డిఎంహెచ్ఓ) స్వయంగా సెంటర్‌ను తనిఖీ చేసి, నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘన తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అవసరమైతే సెంటర్ లైసెన్స్ రద్దు చేయడం లేదా తాత్కాలికంగా మూసివేయడం వంటి చర్యలు తీసుకోవాలని ప్రజలు సూచిస్తున్నారు. ఈ ఘటనతో ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్లపై పర్యవేక్షణ మరింత కఠినతరం చేయాల్సిన అవసరం ఉన్నదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రజల ఆరోగ్యం, నమ్మకం కాపాడేందుకు సరైన వైద్య ప్రమాణాలు పాటించడం అత్యంత కీలకమని వారు హెచ్చరిస్తున్నారు.



# వరంగల్ ఎంజీఎంలో దారుణం

**శవాన్ని ఆటోలో తీసుకెళ్లిన ఘటన కలకలం**

**ఎంజీఎం హాస్పిటల్ / జై భీమ్ న్యూస్ :**

వరంగల్లోని ప్రముఖ ప్రభుత్వ ఆసుపత్రి ఎంజీఎం ఆసుపత్రిలో జరిగిన ఒక ఘటన ప్రజలను కలచివేస్తోంది. వైద్య సేవలపై నమ్మకాన్ని ప్రశ్నించే ఈ సంఘటన స్థానికంగా తీవ్ర ఆవేదనకు దారితీసింది. పర్వతగిరి మండలం చౌటుప్పల్ గ్రామంకు చెందిన ఓ మహిళ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. అయితే, మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించడానికి ఆసుపత్రిలో అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో, కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డబ్బులు అడిగిన ప్రైవేట్ అంబులెన్స్ సేవలను భరించలేక... ఆ కుటుంబం చివరికి మృతదేహాన్ని ఆటోలో తీసుకెళ్లాల్సిన దుర్భర పరిస్థితి ఏర్పడింది. ఈ దృశ్యం అక్కడ ఉన్న ప్రతి ఒక్కరిని కలచివేసింది.

**మానవత్వం ఎక్కడికి పోయింది?**

ఒకవైపు ప్రభుత్వం ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని చెబుతుంటే... మరోవైపు, మృతదేహాన్ని తీసుకెళ్లడానికి కూడా అంబులెన్స్ అందుబాటులో లేకపోవడం ప్రజలను ఆలోచనలో పడేస్తోంది. "జీవించి ఉన్నప్పుడు సేవలు సరిగా లేవు. చనిపోయిన తర్వాత కూడా గౌరవం దక్కడం లేదా?" అనే ప్రశ్నలు ఇప్పుడు వినిపిస్తున్నాయి.

**అంబులెన్స్ లేక... ప్రైవేట్ దందా?**

స్థానికుల ఆరోపణల ప్రకారం. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉండాల్సిన అంబులెన్స్ సదుపాయం లేకపోవడంతో, బయట ప్రైవేట్ అంబులెన్స్‌ల దందా పెరిగిందని అంటున్నారు. ఇంతకుముందే ఈ సమస్యపై పలుమార్లు ఫిర్యాదులు వచ్చినప్పటికీ..ఎటువంటి చర్యలు తీసుకోలేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

**"డబ్బులు ఉంటే అంబులెన్స్...**

లేకపోతే ఆటోలోనే శవం..." అనే పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రజల డిమాండ్**

ఈ ఘటనపై వెంటనే స్పందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు: ఎంజీఎం ఆసుపత్రిలో ఉచిత అంబులెన్స్ సేవలు అందుబాటులోకి తేవాలి. పేద కుటుంబాలకు మృతదేహ రవాణా సౌకర్యం కల్పించాలి ప్రైవేట్ అంబులెన్స్‌ల దందాపై కఠిన చర్యలు తీసుకోవాలి.

**అధికారులు స్పందిస్తారా?**

ఒక మృతదేహాన్ని కూడా గౌరవంగా స్వగ్రామానికి పంపలేని పరిస్థితి. ప్రభుత్వ వైద్య వ్యవస్థపై పెద్ద ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారా? లేక ఇలాంటి ఘటనలు మళ్లీ మళ్లీ పునరావృతమవుతాయా? ప్రజలు సమాధానం కోసం ఎదురు చూస్తున్నారు.



# మంగళగిరిలో ఘనంగా రామాలయ పునఃప్రతిష్ఠ.. హాజరైన మంత్రి లోకేశ్


**విజయవాడ, జై భీమ్ న్యూస్**

రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన నియోజకవర్గమైన మంగళగిరిలో జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణంలోని కొప్పురావుకాలనీలో నూతనంగా నిర్మించిన రామాలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న లోకేశ్‌కు ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక టీడీపీ నాయకులు, ప్రజలు సాదర స్వాగతం పలికారు. అనంతరం పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ హనుమత్, లక్ష్మణ, సీతాసమేత రాముల వారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న లోకేశ్, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పునర్ నిర్మాణానికి తనవంతుగా రూ. 5 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీ దేవి, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పడవల మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్‌లో వాతావరణ మౌలిక సదుపాయాల లోటుపాట్లపై లోక్‌సభలో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

**వరంగల్‌లో ప్రత్యేక వాతావరణ వ్యవస్థ ఏర్పాటు చేయాలి**

**న్యూ ఢిల్లీ / జై భీమ్ న్యూస్ :**



వరంగల్ జిల్లాలో ఆధునిక వాతావరణ పర్యవేక్షణ సదుపాయాల్లో ఉన్న లోటుపాట్లను వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య లోక్‌సభలో ప్రస్తావించారు. ఇటీవలి కాలంలో తీవ్ర వాతావరణ మార్పులు పెరుగుతున్న నేపథ్యంలో, జిల్లాలో తగిన స్థాయి వాతావరణ మౌలిక సదుపాయాలు లేకపోవడం ఆందోళన కలిగిస్తోందని ఎంపీ పేర్కొన్నారు. ఈ అంశంపై స్పందించిన భూ విజ్ఞాన శాఖ సహాయ మంత్రి డా. జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, ప్రస్తుతం వరంగల్ జిల్లాలో ఐదు ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు , వర్షపాతం కొలిచే గేజ్‌లు పనిచేస్తున్నాయని తెలిపారు. అయితే, వరంగల్‌లో డాప్లర్ వెదర్ రాడార్ ఏర్పాటు చేయలేదని స్పష్టం చేశారు. హైదరాబాద్, విశాఖపట్నంలో ఉన్న రాడార్ల ద్వారా వరంగల్ ప్రాంతానికి సేవలు అందుతున్నాయని చెప్పారు. అలాగే, వరంగల్ జిల్లాలో ప్రత్యేకంగా వరద హెచ్చరిక కేంద్రం లేకపోయినా, సమీప జిల్లాల్లో ఉన్న కేంద్రాల ద్వారా పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని కేంద్రమంత్రి వివరించారు. దీనిపై వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య స్పందిస్తూ, ఇతర ప్రాంతాలపై ఆధారపడటం వల్ల అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందనలో లోపాలు ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. జిల్లా స్థాయిలోనే ఖచ్చితమైన వాతావరణ అంచనాలు, మెరుపు హెచ్చరిక వ్యవస్థలు, క్లైమేట్ రెసిలియెన్స్ మెకానిజంలను బలోపేతం చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కేంద్రాన్ని కోరారు. ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న అలర్ట్ వ్యవస్థలు, 'మిషన్ మౌసమ్' వంటి కార్యక్రమాలు ఉన్నప్పటికీ, వరంగల్ వంటి సున్నిత ప్రాంతాల కోసం ప్రత్యేక పెట్టుబడులు అవసరమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఎంపీ స్పష్టం చేశారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించేందుకు ముందస్తు చర్యలు, సమగ్ర విపత్తు నిర్వహణ వ్యవస్థలను మరింత పటిష్టం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు.

# అథ్లెటిక్స్‌లో రాణించిన పెండ్యాల మమతకు ఘన సన్మానం






**వరంగల్, 25 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని పెండ్యాల మమతకు ఆ విభాగం అధ్యాపకులు, పరిశోధకులు శాలువాతో సన్మానం చేసి అభినందనలు తెలిపారు. ఇటీవల ఢిల్లీలో మార్చి 8 నుంచి 13 వరకు నిర్వహించిన అంతర్జాతీయ ప్యారా అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న మమత, షాట్‌పుట్ మరియు జావెలిన్ త్రో విభాగాల్లో ప్రతిభ కనబరిచి తృతీయ స్థానం సాధించి పథకాలతో పాటు బహుమతులు అందుకుంది. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం కమ్మపల్లి గ్రామానికి చెందిన మమత, ఒకవైపు రాజనీతి శాస్త్రంలో పరిశోధక విద్యార్థినిగా కొనసాగుతూనే, మరోవైపు అథ్లెటిక్స్‌లో రాణించడం అభినందనీయమని అధ్యాపకులు పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని పథకాలు సాధించి యూనివర్సిటీకి, తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకటయ్య, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ గడ్డం కృష్ణయ్య, డాక్టర్ వి. సత్యనారాయణ, డాక్టర్ వి. నాగరాజు, పరిశోధక విద్యార్థులు కల్లేపల్లి ప్రశాంత్, కేతపాక ప్రసాద్, రవి, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్‌తో ఏపీ పర్యాటక శాఖ ఎంఓయూ

**విజయవాడ, జై భీమ్ న్యూస్**

ఆంధ్రప్రదేశ్ ను కలినరీ టూరిజం హబ్ గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ తిరుపతిలోని ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ తో అవగాహనా ఒప్పందం చేసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో ఈ కీలకమైన ఎంఓయూ కుదిరింది. ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు– ఏపీ పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్‌లు ముఖ్యమంత్రి సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. తెలుగు రుచులను, వంటకాలను ప్రపంచానికి పరిచయం చేయటంతో పాటు ప్రాంతీయ ఆహార సంస్కృతిని చాటి చెప్పేలా ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ సహకారం అందించనుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌ను కలినరీ టూరిజానికి ఓ కీలకమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు వీలుగా ఈ ఎంఓయూ తోడ్పడనుంది. ప్రత్యేకించి కలినరీ విభాగంలో నైపుణ్యాభివృద్ధి కల్పన, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ నిర్వహించే ఫుడ్ ఫెస్టివల్స్, టూరిజం ఈవెంట్లను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తెలుగు వంటకాల రుచులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలియచేసేలా కార్యాచరణ చేపట్టనున్నారు. ఈ అవగాహనా ఒప్పందం కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, ఏపీ హోటల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం ఆటో డ్రైవర్ల ప్రధాన బాధ్యత

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్





**వరంగల్, 25 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం ఆటో డ్రైవర్ల ప్రధాన బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రోడ్డు భద్రత చర్యలలో భాగంగా "ఆరైవ్ అలైవ్" (అరైవ్ అలైవ్) కార్యక్రమాన్ని ఈ నెల 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కాజీపేట రైల్వే ఆడిటోరియంలో వరంగల్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, అతివేగం మరియు నిర్లక్ష్య డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాలను నివారించాలని సూచించారు. ప్రయాణికుల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకొని వాహనం నడపాలని, మితిమీరిన ప్రయాణికులను ఎక్కించకూడదని అన్నారు. డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు. ప్రతి డ్రైవర్ రోడ్డు నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ అధికారులు రోడ్డు భద్రతపై పలు సూచనలు అందించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, జీబ్రా క్రాసింగ్ వద్ద జాగ్రత్తలు తీసుకోవడం, హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రతపై తమ బాధ్యతను గుర్తించి, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ట్రాఫిక్ కాజీపేట ఏసీపీ సత్యనారాయణ, ప్రశాంత్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు వెంకన్న, సీతారెడ్డి, సుజాత, కాజీపేట ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మార్చ్ 26 రాష్ట్రవ్యాప్త బంద్‌కు కుప్మా సంపూర్ణ మద్దతు

### స్కాలర్షిప్ రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్



**హన్మకొండ, 25 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

పిడిఎస్యు పిలుపు మేరకు మార్చి 26న నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త బంద్‌కు కాకతీయ యూనివర్సిటీ ప్రైవేట్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (కుప్మా) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా హనుమకొండ రాంనగర్‌లో బంద్ పోస్టర్‌ను ప్రైవేట్ విద్యాసంస్థల యూనియన్ నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాస్టర్జి డిగ్రీ కాలేజ్ చైర్మన్ సుందర్ రాజ్ మాట్లాడుతూ, ప్రభుత్వం తక్షణమే పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఈ సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని ఆయన పేర్కొన్నారు. పిడిఎస్యు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ మాట్లాడుతూ, స్కాలర్షిప్ మరియు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆలస్యం కారణంగా ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వలేకపోతున్నాయని అన్నారు. దీంతో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 20 శాతం విద్యారంగానికి కేటాయించాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుప్మా వరంగల్ జిల్లా కార్యదర్శి గీతాంజలి మహిళా డిగ్రీ కాలేజ్‌కు చెందిన వేణుమాధవ్, సభ్యులు శర్వాణి, నారాయణ రెడ్డి, శ్రీ చైతన్య, సదానందం, జాగృతి మహేందర్, అలాగే పిడిఎస్యు జిల్లా నాయకులు మోహన్, రమణ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులకు అండగా నిలుద్దాం

**ప్రజాసేవ మన బాధ్యత**
**అధికారులు నేర్పిస్తున్న క్రమశిక్షణకు అలవాటు పడాలి**
**వృత్తి మాత్రమే మన సొంతం కాదు వృద్ధుల సేవచేయడం మన ఆత్మ గౌరవం**
**జాలి పడి సేవ చేయడం కాదు జాగ్రత్త పడుతూ వృద్ధులసేవలో ముందుకు సాగాలి**
**పోలీసుల సేవలు ఎప్పుడు ప్రత్యేకమే**
**ప్రతి సందర్భంలో మనదనుకోని సేవ చేయాలి**

**కాజీపేట జై భీమ్ న్యూస్:-**

పోలీసుల సేవలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడగలవని ప్రజలు భావిస్తూ ఉంటారు. ఉన్నతాధికారులు ప్రజల కోసం పరితపిస్తూ చేస్తున్న సేవలు కిందిస్థాయి పోలీస్ సిబ్బంది అనుసరిస్తూ ఆచరిస్తూ విధులు నిర్వహిస్తుండడం ప్రజాసేవలను అభివృద్ధి పరచడం కోసం నిరంతర ప్రక్రియగా పోలీస్ ఉద్యోగంలో భాగంగా భావించాల్సి ఉంటుంది. బుధవారం ఫాతిమా నగర్ జంక్షన్ లో ఒక వృద్ధురాలు బ్యాంకు సహాయార్థం రోడ్డు దాటలేని పరిస్థితిలో ఉంటుండగా అదే సమయంలో వాహనాల రద్దీ రోడ్డును చుట్టుముట్టగా వృద్ధాప్యంలో ఉన్న మహిళ రోడ్డు దాటలేక పడుతున్న ఇబ్బందులను అక్కడే పోలీస్ విధుల్లో ఉన్న ఏఆర్ కానిస్టేబుల్ బొక్క దేవప్రసాద్ వృద్ధురాలి దగ్గరకు వెళ్లి జాగ్రత్తగా రోడ్డు దాటించి



బ్యాంకు వద్దకు చేర్చాడు. దానిని గమనిస్తున్న వాహనదారులు ఒక్కసారిగా అవాక్కై వాళ్ళ వైపు చూడడం మొదలెట్టారు. పేద ప్రజలకు చేసే సేవ వృద్ధులకు చేసే సేవలు పోలీసు విధుల్లో ఎంతో



గొప్పతనాన్ని ఎంతో ఆత్మీయతను ఎంతో ఆత్మ గౌరవాన్ని పెంపొందిస్తాయని తన ఉన్నత అధికారులు ఇస్తున్న శిక్షణ సూచనలను పట్టి ఇలాంటి సేవలు చేస్తున్నామని కానిస్టేబుల్ ఈ సందర్భంగా తెలిపాడు.

# వెట్టి చాకిరి, మానవ అక్రమ రవాణా నిర్మూలనకు సమన్వయం కీలకం: ఇన్స్పెక్టర్ శ్యాంసుందర్






**వరంగల్, 25 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు (ఎన్.జి.ఓస్) సమన్వయంతో పనిచేస్తే వెట్టి చాకిరి, మానవ అక్రమ రవాణాను సమర్థవంతంగా నిర్మూలించవచ్చని వరంగల్ పోలీస్ కమిషనరేట్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్స్పెక్టర్ జె. శ్యాంసుందర్ తెలిపారు. బుధవారం సుబేదారిలోని అసంత భవన్‌లో ఎఫ్ఎంఎం సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి జిల్లాల నుంచి వచ్చిన ఎన్జీవో ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ శ్యాంసుందర్ మాట్లాడుతూ, వెట్టి చాకిరి ప్రధానంగా ఇటుక భట్టీలలో, అసంఘటిత రంగంలో ఎక్కువగా ఉందని చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను అధిక వేతనాల ఆశ చూపించి తీసుకువచ్చి, వారికి తక్కువ జీతం ఇచ్చి ఎక్కువ పని గంటలు చేయించడం సాధారణమైందని పేర్కొన్నారు. మానవ అక్రమ రవాణాకు గురైన వారు వెట్టి చాకిరిలో చిక్కుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆయన అన్నారు. ఇలాంటి ఘటనలను గుర్తించడానికి చట్టపరమైన ప్రమాణాలను ఆధారంగా తీసుకొని ప్రభుత్వ అధికారులు, ఎన్జీవోలు కలిసి పని చేయాలని సూచించారు. కార్మికులు భయంతో ముందుకు రాకపోవడం వల్ల ఇలాంటి కేసులు బయటపడవని, అందువల్ల ఎన్జీవో ప్రతినిధులు వర్క్‌సైట్లలో మరియు వలస వెళ్తున్న కార్మికులపై నిఘా ఉంచాలని తెలిపారు. అలాగే కార్మికులకు వారి హక్కులు, లేబర్ కోడ్స్‌పై అవగాహన కల్పించడం అత్యంత అవసరమని అన్నారు. వెట్టి చాకిరిలోకి నెట్టడం చట్టరీత్య నేరమని, దీనిపై భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్), వెట్టి చాకిరి నిర్మూలన చట్టం-1976 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జువెనైల్ జస్టిస్ బోర్డు సభ్యురాలు డాక్టర్ గోపికా రాణి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు డాక్టర్ సుధాకర్, సుజాత, డేవిడ్, చైల్డ్ రైట్స్ అడ్వకేసీ ఫోరం కన్వీనర్ మండల పరుశరాములు, సంస్థ కోఆర్డినేటర్లు బత్తుల కరుణ, ఎర్ర శ్రీకాంత్, ఇక్బాల్ పాషా, ఎం. అజయ్ కుమార్, ప్రదీప్, ప్రసాద్, రాకేష్ సుదర్శన్, నరసింహస్వామి తదితరులు పాల్గొన్నారు. అంతేకాకుండా, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్‌కు చెందిన డాక్టర్ ఆనంద్, ఐజక్ ముఖ్య వనరుల వ్యక్తులుగా (రిసోర్స్ పర్సన్స్) పాల్గొన్నారు. ఈ శిక్షణలో వివిధ జిల్లాల నుంచి సుమారు 60 మంది ఎన్జీవో ప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమం భాగంగా వెట్టి చాకిరి మరియు మానవ అక్రమ రవాణా నిర్మూలన కోసం ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ఈ ప్రణాళికను అనుసరించి నెట్‌వర్క్‌లో ఉన్న అన్ని ఎన్జీవోలు ఈ అంశాలపై సమిష్టిగా పనిచేయాలని నిర్ణయించారు.

# చట్టబద్ధ దత్తతతోనే మాతృత్వ సార్థకం

### అక్రమ దత్తతలకు తావులేదు: కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

**హన్మకొండ, 25 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**



మాతృత్వం ప్రతి మహిళకు ఒక అమూల్యమైన వరమని, ఆ అనుభూతిని పొందడానికి చట్టబద్ధమైన దత్తతే సరైన మార్గమని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ స్పష్టం చేశారు. అక్రమ



దత్తతలు పిల్లల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టడమే కాకుండా చట్టపరమైన సమస్యలకు దారి తీస్తాయని హెచ్చరించారు. బుధవారం కంచరకుంటలోని మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రత్యేక దత్తత విభాగాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర దత్తత వనరుల ప్రాధికార సంస్థ (సిఎఆర్ఎ) నిబంధనలకు అనుగుణంగా ఎంపికైన నాలుగు నెలల శిశువును హనుమకొండ జిల్లా వడ్డేపల్లికి చెందిన దంపతులకు దత్తతగా అప్పగించారు. ఆ దంపతులు నాలుగు సంవత్సరాల క్రితం దరఖాస్తు చేసుకున్నారని, సీనియారిటీ మరియు విధివిధానాల ప్రకారం వారికి ఈ అవకాశం లభించినట్లు అధికారులు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి దత్తత ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, చట్టబద్ధంగా జరగాలని తెలిపారు. కేంద్ర దత్తత వనరుల ప్రాధికార సంస్థ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించడం ద్వారా మాత్రమే పిల్లలకు సురక్షిత భవిష్యత్తు కల్పించవచ్చని పేర్కొన్నారు. సమాజంలో ఇంకా కొంతమంది అక్రమ దత్తతలకు పాల్పడుతున్నారని, అలాంటి చర్యలు తీవ్రమైన నేరమని, ప్రజలు వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి ఎం. విశ్వజ మాట్లాడుతూ, 2007 సంవత్సరం నుండి ఇప్పటివరకు ప్రత్యేక దత్తత విభాగం ద్వారా దేశీయ దత్తత కింద 220 మంది చిన్నారులను కుటుంబాలకు అందజేసినట్లు తెలిపారు. అంతర్జాతీయ దత్తత కింద అమెరికా, మాల్టా, ఇటలీ, దుబాయి వంటి దేశాలకు 12 మంది పిల్లలను దత్తతగా ఇచ్చినట్లు వెల్లడించారు. ఇది ప్రభుత్వ విధానాలపై ప్రజల విశ్వాసాన్ని తెలియజేస్తుందని అన్నారు. కలెక్టర్ శిశు గృహాన్ని సందర్శించి అక్కడ ఉన్న పిల్లలతో ముచ్చటించారు. చిన్నారుల ఆరోగ్యం, సంరక్షణ, విద్యా పరిస్థితుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. దత్తతకు ఇవ్వబడిన శిశువును ఎత్తుకొని ఆప్యాయంగా పలకరించి, ఆ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. పిల్లలను ప్రేమతో, బాధ్యతతో పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు డాక్టర్ పరికి సుధాకర్, ఇంచార్జి జిల్లా శిశు పరిరక్షణ అధికారి ఎస్. ప్రవీణ్ కుమార్, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం. మౌనిక, శిశు గృహ ఇన్‌చార్జి మేనేజర్ అనుముల మాధవి, సోషల్ వర్కర్ సంగి చైతన్య, నర్స్ పుల్ల మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల వద్ద ప్రైవేట్ బస్సుకు ప్రమాదం..

**నంద్యాల, జై భీమ్ న్యూస్**

వేగంగా వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సు టైరు పేలిపోవడంతో అదుపుతప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకువెళ్లిన ఘటన నంద్యాల జిల్లా కేంద్రం సమీపంలో ఈరోజు వేకువజామున జరిగింది. ఈ ఘటనలో పది మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. గాఢ నిద్రలో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడి భయంతో వణికిపోయారు. ప్రయాణికులు గాయాలతో బయటపడటంతో పెనుప్రమాదం తప్పినట్లైంది. వివరాల్లోకి వెళ్తే.. మార్నింగ్ స్టార్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు 35 మంది ప్రయాణికులతో వెళ్తోంది. నంద్యాల సమీపంలోని జాతీయ రహదారిపైకి రాగానే తెల్లవారుజామున బస్సు టైరు పెద్ద శబ్దంతో పేలిపోయింది. ఆ సమయంలో బస్సు అధిక వేగంతో ఉండటంతో డ్రైవర్ ఎంత ప్రయత్నించినా అదుపులోకి రాలేదు. దీంతో రోడ్డు పక్కన ఉన్న పొలాల్లోకి వేగంగా దూసుకెళ్లింది. బస్సు అకస్మాత్తుగా కుదుపులకు లోనవడంతో లోపల ఉన్న ప్రయాణికులు భయంతో హాహాకారాలు చేశారు. అదృష్టవశాత్తు బస్సు బోల్తా పడకుండా పొలాల్లో నిలిచిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఆ పేరుతో ఇంకెన్నాళ్లు రాజకీయం చేస్తారు: బండి సంజయ్

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

ప్రాంతీయ అసమానతల పేరుతో ఇంకెన్నాళ్లు రాజకీయం చేస్తారని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రాంతీయ అసమానతల పేరుతో దేశాన్ని విభజించాలని చూస్తున్నారా అని మండిపడ్డారు. దేశభక్తి, జాతీయవాదం మీలో మచ్చుకైనా కనిపిస్తోందా అని ప్రశ్నించారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో కాంగ్రెస్ కూటమి ఓడిపోతుందనే ఆందోళన వారిలో మొదలైనట్లుగా ఉందని అన్నారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్ని జిమ్మిక్కులు చేసినా పారడం లేదని ఎద్దేవా చేశారు. అందుకే దక్షిణాదికి అన్యాయం అంటూ కాంగ్రెస్ వారు కొత్త డ్రామా ఆడుతున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి మహిళలంటే ద్వేషమని బండి సంజయ్ ఆరోపించారు. అందుకే దేశాన్ని సుదీర్ఘంగా పాలించిన కాంగ్రెస్ మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని కుట్రలు చేసినా మహిళలకు రిజర్వేషన్లు అమలు చేస్తామని అన్నారు. మహిళలకు 33 శాతం సీట్లు ఇస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వచ్చిన నష్టమేమిటని ప్రశ్నించారు.



జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా



# ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు






### డంపింగ్ యార్డ్ తొలగించే వరకు పోరాటం ఆగదు! ఎంసిపిఐ(యు) హన్మకొండ జిల్లా కార్యదర్శి ఎన్ రెడ్డి హంసారెడ్డి

(హనుమకొండ జై భీమ్ న్యూస్)

మడికొండ యార్డులో చెత్తగుట్టలుగా పేరుకుపోయి విష రసాయనాలు వెలువడి మంటలు చెలరేగుతున్నాయి.దీని నుంచి వచ్చే పొగతో మడికొండ,రాంపూర్, ఎలుకుర్తి,నర్సింగరావు పల్లె,అయోధ్య పురం, కుమ్మరిగూడెం, టేకులగూడెం,బాపూజీ నగర్, డీజిల్ కాలనీ,కడిపికొండ,తరాలపల్లి వాసులు అష్ట కష్టాలు పడుతున్నారు.అని ఎం సి పి ఐ (యు)హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎన్ రెడ్డి హంసారెడ్డి అన్నారు.ఈరోజు ఎంసీపీఐ(యు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మడికొండ -- రాంపూర్ ప్రాంతాల మధ్యనున్నటువంటి డంపింగ్ యార్డ్ ను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్ రెడ్డి హంసా రెడ్డి గారు మాట్లాడుతూ ....స్వచ్ఛ వరంగల్ -- చెత్త శుద్ధికరణ అంటూ గ్రేటర్ వరంగల్ ప్రజా విభాగం గొప్పలు చెబుతోంది.ఇంటి వద్ద తడి-- పొడి చెత్త వేరు చేయాలని ప్రజలకు సూచిస్తుంది.మరోవైపు వరంగల్,హనుమకొండ నగరాల్లో 66 డివిజన్ల లో రోజూ పోగవుతున్న చెత్తను నిల్వ చేసేందుకు డంపింగ్ యార్డుల కొరత వెంటాడుతుంది.11 ఏళ్లుగా రాంపూర్ డంపింగ్ యార్డ్ ఒక్కటే దిక్కైందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రతిరోజు 480 టన్నుల చెత్త రాంపూర్ డంపింగ్ యార్డ్ కు చేరడంతో రాంపూర్ డంపింగ్ యార్డ్ మొత్తం జామైందనీ అన్నారు.చెత్త పోయడానికి స్థలం లేదు నెలరోజులుగా వెలు వడుతున్న పొగతో స్థానిక ప్రజలు అల్లాడుతున్నారని వారన్నారు ప్రస్తుతం నాలుగు లక్షల టన్నుల చెత్తాచెదారం పేరుకుపోయింది.చెత్త సమస్య రోజురోజుకూ తీవ్రతరం అవుతోంది .గాలి,నీరు,నేల చుట్టు పరిసర ప్రాంతాలు కాలుష్యం బారిన పడి నిత్యం పొగ మరియు విషవాయువులతో ప్రజల ప్రాణాలను మారణకాండలా దహించి వేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారం అయ్యేంతవరకు పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైల్వే జేఏసీ చైర్మన్ కొండ్ర నర్సింగరావు గారు వైస్ చైర్మన్ జి.భాస్కర్ గారు ఎం సి పి ఐ యు హన్మకొండ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గడ్డం నాగార్జున గారు మాస్ సావిత్రి గారు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్‌లను రద్దు చేసేంతవరకు పోరాడుదాం

### కార్మిక కర్షక రైతు వ్యవసాయ కూలీలకు జి. ప్రభాకర్ రెడ్డి సిపిఎం జిల్లా కార్యదర్శి పిలుపు





(హనుమకొండ జై భీమ్ న్యూస్)

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికులకు నష్టం చేసే విధంగా తీసుకొచ్చారూ లేబర్ కోడ్లను తక్షణమే ఈ పార్లమెంటు సమావేశాలలో రద్దు చేయాలని అంతవరకు కార్మికులు ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలనీ జి ప్రభాకర్ రెడ్డి కార్మిక, కర్షక రైతు వ్యవసాయ కూలీలకు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈరోజు హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సిపిఎం వెస్ట్, సౌత్ , నార్త్ మండల కమిటీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెస్ట్ మండల కార్యదర్శి వాంకుడోత్ వీరన్న అధ్యక్షత వహించగాముఖ్య అతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.... కార్మికులకు కష్టజీవులకు మోడీ వ్యతిరేకంగా పనిచేస్తున్నాడని ఆయన మండి పడ్డారు. అందులో భాగంగానే ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి యజమానులకు కార్మికులను కట్టు బానిసల్లాగా మారుస్తున్నారని ఆయన మండిపడ్డారు అలాగే వి బి జి రాంజీ బిల్లు, విద్యుత్ సవరణ ముసాయిధ, బిల్లు, విత్తన చట్టం, తీసుకువచ్చి ప్రైవేట్ కార్పొరేట్ పెట్టుబడుదారికి అనుకూలంగా చట్టాలను తీసుకొస్తూపేదలకు 100 రోజులు పని కల్పించే ప్రజలందరికీ ఉపయోగపడే,ఉపాధి కల్పించే గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి కూలీల పొట్ట కొడుతుందని ఆయన మండిపడ్డారూ. అలాగే సంస్కరణ బిల్లు తీసుకురావడం ఫలితంగా ప్రజలందరి మీద అధిక బారాలు పడతాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒకపక్క ధరల పెరుగుదల విద్య, వైద్యం,నిరుద్యోగ, దారిద్యం నివారించకుండా కార్మికులకు కష్టజీవుల పొట్టన కొట్టే చర్యలు చేపడుతున్న మోడీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏం చుక్కయ్య, బొట్ల చక్రపాణి, జిల్లా కమిటీ సభ్యులు మంద సంపత్, నార్త్ మండల కార్యదర్శి గాదె రమేష్, కార్యకర్తలు దూడపాక రాజేందర్ డి.రమేష్, ఇంజపెల్లిరాజు, పొట్లపల్లి రాజు,రవీందర్, సమ్మయ్య, సుగుణ, మణమ్మ, వీరన్న, రాజయ్య శ్రీను, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక"లో భాగంగా కాకతీయ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ విభాగంలోని ల్యాబ్‌ను ఆధునికీకరించినట్లు విభాగాధిపతి డాక్టర్ బి. రమ ఒక ప్రకటనలో తెలిపారు





(కేయూ జై భీమ్ న్యూస్)

ఈ ఆధునికీకరించిన ల్యాబ్‌ను నేడు ఉదయం విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విభాగంలో ఇప్పటికే ఉన్న 30 కంప్యూటర్లతో పాటు రిజిస్ట్రార్ నిధుల ద్వారా అదనంగా 30 కొత్త కంప్యూటర్ సిస్టమ్స్‌ను సమకూర్చి మరో ల్యాబ్‌ను కూడా ఆధునికీకరించారు. అదేవిధంగా, విభాగ అధ్యాపకులు డాక్టర్ బి. రమ మరియు డాక్టర్ మంజులలకు మంజూరైన రుసా నిధులతో అవసరమైన పరికరాలను కూడా సమకూర్చినట్లు తెలిపారు. ఈ మొత్తం పనుల వ్యయం సుమారు రూ. 30.00 లక్షలుగా అంచనా వేశారు. ప్రస్తుతం విభాగంలో ఎంసీఏ మరియు ఎంఎస్సీ (కంప్యూటర్ సైన్స్) కోర్సుల్లో సుమారు 240 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారని, ఈ ఆధునిక ల్యాబ్ సదుపాయాలు వారి రోజువారీ తరగతులు మరియు ప్రాక్టికల్స్‌కు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అలాగే, ప్రస్తుతం ఉన్న పాత కంప్యూటర్లను రిజిస్ట్రార్ ఆదేశాల మేరకు అవసరమున్న ఇతర విభాగాలకు పంపిణీ చేసి వారి అవసరాలను తీర్చనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, దూర విద్య కేంద్ర సంచాలకులు ఆచార్య బి. సురేష్ లాల్, ఆచార్య ఆర్. మల్లికార్జున రెడ్డి, డీన్ ఆచార్య జి. హనుమంతు, విభాగ అధ్యాపకులు డాక్టర్ మంజుల, డాక్టర్ రమేష్, డాక్టర్ సలోని ఫాతిమా, డాక్టర్ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ వైస్ ఛాన్సలర్, అర్థశాస్త్ర విభాగ ఆచార్యులు దివంగత ఆచార్య నాగిశెట్టి లింగమూర్తి దశదిన కర్మ సందర్భంగా

(హనుమకొండ జై భీమ్ న్యూస్)



ఆయన స్వగృహాన్ని వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఆచార్య లింగమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సానుభూతిని తెలియజేశారు.

## రూ.60 లక్షల నాన్ డ్యూటీ లిక్కర్ ధ్వంసం

### అక్రమ రవాణాపై ఎక్సైజ్ శాఖ గట్టి దెబ్బ



రంగారెడ్డి జిల్లా, 25 మార్చి 2026(జై భీమ్ న్యూస్)

జిల్లాలో అక్రమంగా మద్యం రవాణా, నిల్వ మరియు విక్రయాలపై ఎక్సైజ్ శాఖ కఠిన చర్యలు కొనసాగిస్తున్న నేపథ్యంలో, బుధవారం భారీ స్థాయిలో నాన్ డ్యూటీ పెయిడ్ (ఎన్.డి.పి) మద్యం బాటిళ్లను ధ్వంసం చేయడం జరిగింది. సుమారు రూ.60 లక్షల విలువైన మద్యం సీజ్ చేసిన ఈ చర్య జిల్లాలో అక్రమ మద్యం వ్యాపారంపై గట్టి హెచ్చరికగా నిలిచింది. గత ఆరు నెలల కాలంలో ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక దాడులు, తనిఖీలు నిర్వహిస్తూ మొత్తం 103 కేసులను నమోదు చేశారు. ఈ కేసుల్లో భాగంగా స్వాధీనం చేసుకున్న 6,859 మద్యం బాటిళ్లు మరియు 44 బీరు బాటిళ్లను శంషాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పంచుల సమక్షంలో రోలర్‌తో పూర్తిగా ధ్వంసం చేశారు. ధ్వంస ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించామని అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి. దశరథ్ మాట్లాడుతూ, ఇతర రాష్ట్రాల నుంచి తక్కువ ధరలకు మద్యం తీసుకువచ్చి అక్రమంగా విక్రయించడం ప్రభుత్వానికి ఆదాయ నష్టం కలిగించడమే కాకుండా చట్ట విరుద్ధమని తెలిపారు. ఇటువంటి చర్యలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని, కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, జిల్లాలో అక్రమ మద్యం సరఫరా శృంఖలపై నిఘాను మరింత కట్టుదిట్టం చేస్తున్నామని, చెక్‌పోస్టులు, స్పెషల్ డ్రైవ్‌లు, ఇంటెలిజెన్స్ సమాచారంతో దాడులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలు కూడా ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించాలని కోరారు. ఎక్సైజ్ శాఖ చేపట్టిన ఈ చర్యలతో అక్రమ మద్యం వ్యాపారంపై నియంత్రణ సాధించడంలో మరో ముందడుగు పడినట్టుగా అధికారులు భావిస్తున్నారు.

## పుకార్లకు చెక్... హైదరాబాద్‌లో ఇంధన కొరత లేదు: సీపీ సజ్జనర్

హైద్రాబాద్, 25 మార్చి 2026(జై భీమ్ న్యూస్)



నగరంలో పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడనుందనే వార్తలు సోషల్ మీడియాలో హల్చల్ చేస్తున్న నేపథ్యంలో పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ ప్రజలకు కీలక భరోసా ఇచ్చారు. నగరంలో ఇంధన కొరత ఉందనే వార్తలు పూర్తిగా అవాస్తవమని, అవి కేవలం పుకార్లు మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో రాబోయే 60 రోజులకు సరిపడా పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని సీపీ తెలిపారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఇంధన సరఫరా వ్యవస్థ ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగుతోందని, ఆయిల్ కంపెనీలతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తున్నామని చెప్పారు. ఈ నెల 22న నగరంలో 3,024 కిలోలీటర్ల ఇంధన విక్రయాలు జరిగితే, వదంతుల ప్రభావంతో 23వ తేదీకి అవి 6,400 కిలోలీటర్లకు పెరిగినట్లు వెల్లడించారు. ఒకేసారి పెద్ద సంఖ్యలో ప్రజలు పెట్రోల్ బంకులకు వెళ్లి ఫుల్ ట్యాంకులు చేయించుకోవడంతో డిమాండ్ అకస్మాత్తుగా పెరిగిందని వివరించారు. ఈ అధిక డిమాండ్ కారణంగానే కొన్ని ప్రాంతాల్లో తాత్కాలికంగా 'నో స్టాక్' బోర్డులు కనిపించాయని తెలిపారు. ప్రజలు పుకార్లను నమ్మకుండా, అవసరానికి మించిన ఇంధనాన్ని కొనుగోలు చేయవద్దని సీపీ సూచించారు. ముఖ్యంగా బాటిళ్లలో లేదా ఇతర ప్రమాదకర పద్ధతుల్లో ఇంధనాన్ని నిల్వ చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు. మొత్తంగా, నగరంలో ఇంధన సరఫరా పూర్తిగా నియంత్రణలోనే ఉందని, ప్రజలు ప్రశాంతంగా ఉండాలని సీపీ సజ్జనర్ విజ్ఞప్తి చేశారు.

## పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద




వరంగల్, 25 మార్చి 2026(జై భీమ్ న్యూస్)

ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు వరంగల్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రచార వాహనాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్మెంట్ కార్పొరేషన్ (టిజిఆర్ఈడిసిఓ) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గృహ వినియోగదారులు తమ ఇళ్ల పైకప్పులపై సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని విద్యుత్ అవసరాలను స్వయం సమృద్ధిగా తీర్చుకోవాలని సూచించారు. పథకం కింద ఒక కిలోవాట్ సోలార్ ప్యానెల్‌కు రూ.30 వేల వరకు, రెండు కిలోవాట్లకు రూ.60 వేల వరకు, మూడు కిలోవాట్లు లేదా అంతకంటే ఎక్కువ సామర్థ్యానికి రూ.78 వేల వరకు సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. సోలార్ ద్వారా ఉత్పత్తి అయ్యే అదనపు విద్యుత్తును పవర్ గ్రిడ్‌కు అందజేసి ఆదాయం పొందే అవకాశం కూడా ఉందని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ పథకంపై విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రచార వాహనాన్ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాల ద్వారా కూడా ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, టిజిఆర్ఈడిసిఓ జిల్లా మేనేజర్ రాజేందర్, ఫీల్డ్ ఆఫీసర్ నవీన్ కుమార్ యాదవ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ సూచనలను సవరించాలి

**పి.డి.ఎస్.యు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహ రావు**
**కె.యు.లో షాహిద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల 95వ వర్ధంతి స్మారక సభ**







**(కేయు జై భీమ్ న్యూస్)**

రాష్ట్ర విద్యారంగ అభివృద్ధికి తెలంగాణ విద్య కమిషన్ చైర్మన్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి చేసిన సూచనల్లో కొన్నింటిని సవరించాలని పి.డి.ఎస్.యు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. నరసింహారావు డిమాండ్ చేశారు.బుధవారం కాకతీయ యూనివర్సిటీ ఎస్.డి.ఎల్.సి.ఇ. లో గల సైకాలజీ విభాగంలో భారత జాతీయోద్యమ వీరులు షాహిద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 95వ వర్ధంతి స్మారక వారోత్సవాల (మార్చి 23 నుండి 30 వరకు) సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలు వేసి, ఘనంగా నివాళులర్పించటం జరిగింది. ఈ సందర్భంగా బి. నరసింహారావు మాట్లాడుతూ దేశంలో నిజమైన స్వాతంత్రం కోసం , కుల మత ఆర్థిక అసమానతలు లేని సంపూర్ణ సమాజం కోసం పోరాడుతూ ప్రాణాలు అర్పించిన షాహిద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల పోరాట స్ఫూర్తితో నేటి విద్యార్థి, యువత ఉద్యమించాలనిపిలుపునిచ్చారు. కేంద్రంలో నరేంద్ర మోడీ, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు విద్యారంగం పట్ల నిర్లక్ష్య వైఖరిని అనుసరిస్తున్నారని, విద్య రంగానికి బడ్జెట్లో తక్కువ నిధులు కేటాయిస్తూ విద్యా వ్యవస్థను సంక్షోభంలోకి నెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చేసిన సూచనలు కొన్ని విద్యారంగ అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి అడ్డంకిగా ఉన్నాయని అన్నారు. పెండింగ్లో ఉన్న పేద విద్యార్థుల స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలని, రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల అభివృద్ధికి, ఒక్కొక్క యూనివర్సిటీకి బడ్జెట్లో 1000 కోట్ల రూపాయలతో ప్రత్యేక ప్యాకేజీ రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులను శాశ్వత ప్రతిపాదికన భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి.డి. ఎస్.యు. వరంగల్- హన్మకొండ జిల్లా అధ్యక్షులు బోయినపల్లి అజయ్, రాష్ట్ర గర్ల్స్ కో- కన్వీనర్ పి.అనూష, రాష్ట్ర నాయకులు దండు వినయ్, కె.యు. నాయకులు లోకేష్, ప్రవర్ధన్, శివకుమార్, దేవా, పూజిత, రమ్య, తేజస్విని, ప్రతాప్, ధర్మ, సోనీ,అమూల్య ,మాళవిక తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్ వాలిడేషన్ ఆక్ట్ 2025 రద్దు చేయాలి

**జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు పెన్షనర్ల ధర్నా**

**వరంగల్ / జై భీమ్ న్యూస్ :**







ఎస్‌జిపిఏటి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో పెన్షన్ వాలిడేషన్ ఆక్ట్ 2025 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది పెన్షనర్లు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్రు సుధీర్ బాబు (జిల్లా ఇంచార్జి), జిల్లా ప్రధాన కార్యదర్శి గునిగంటి సాంబయ్య, మార్కెట్ కమిటీ అధ్యక్షులు నాగపురి సారయ్య ఆధ్వర్యం వహించారు. సుమారు 200 మంది పెన్షనర్లు పాల్గొని ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కర్రు సుధీర్ బాబు మాట్లాడుతూ, పెన్షనర్లను రెండు వర్గాలుగా విభజించడం వారి హక్కులను హరించడమేనని తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. గునిగంటి సాంబయ్య మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన హక్కులకు విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. మార్కెట్ కమిటీ అధ్యక్షులు నాగపురి సారయ్య మాట్లాడుతూ, ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల పెన్షనర్లకు అన్యాయం జరుగుతుందని, వెంటనే పెన్షన్ వాలిడేషన్ ఆక్ట్ 2025ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా సందర్భంగా నాయకులు, పెన్షనర్లు కలిసి వాలిడేషన్ చట్ట ప్రతులను చింపివేసి తమ నిరసన వ్యక్తం చేశారు. తదనంతరం జిల్లా కలెక్టర్ సత్యశారద గారికి వినతి పత్రం సమర్పించి, ప్రధానమంత్రికి పంపించాలని కోరారు

# ఎస్‌బీఐ ఖాతాదారులకు పండుగే పండుగ !

**ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్ల భారీ పెంపు!!**
**ఎస్‌బీఐ బల్క్ టర్మ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లు పెంపు**
**రూ. 3 కోట్ల కంటే ఎక్కువ డిపాజిట్లపై వడ్డీ రేట్ల సవరణ**
**సాధారణ కస్టమర్ల కంటే సీనియర్ సిటిజన్లకు అధిక వడ్డీ**
**కొత్త, రెన్యువల్ డిపాజిట్లకు మాత్రమే వర్తించే కొత్త వడ్డీ రేట్లు**




**(న్యూఢిల్లీ జై భీమ్ న్యూస్)**

ఎస్‌బీఐ తన వినియోగదారులకు ఒక శుభవార్తను అందించింది. బల్క్ టర్మ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను పెంచుతున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం ద్వారా ఖాతాదారులకు అధిక రాబడి లభించనుంది. కొత్త రేట్లు తక్షణమే అమల్లోకి వస్తాయి.

**ఎస్‌బీఐ తాజా వడ్డీ రేట్ల వివరాలు**

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) తమ బ్యాంకులో అకౌంట్ కలిగి ఉన్న కస్టమర్లకు తీపి కబురు అందించింది. బల్క్ టర్మ్ డిపాజిట్లపై (రూ. 3 కోట్ల కంటే ఎక్కువ) వడ్డీ రేట్లను పెంచుతున్నట్లు ప్రకటించింది. తాజాగా సవరించిన ధరల ప్రకారం, ఏడాది నుంచి రెండేళ్ల లోపు కాలపరిమితి గల డిపాజిట్లపై వడ్డీ రేటును 6.25 శాతం నుంచి 6.50 శాతానికి పెంచింది. సాధారణ కస్టమర్ల కంటే సీనియర్ సిటిజన్లకు ఎప్పుడూ అదనపు వడ్డీ లభిస్తుంది. వీరి కోసం 180 రోజుల నుంచి ఏడాది లోపు డిపాజిట్లపై వడ్డీ రేటు 6.10 శాతం నుంచి 6.35 శాతానికి, ఏడాది నుంచి రెండేళ్ల డిపాజిట్లపై 6.75 శాతం నుంచి 7.00 శాతానికి పెరిగింది. ఈ కొత్త వడ్డీ రేట్లు కొత్తగా చేసే డిపాజిట్లకు, మెచ్యూరిటీ తర్వాత రెన్యువల్ చేసే డిపాజిట్లకు మాత్రమే వర్తిస్తాయని ఈ సందర్భంగా ఎస్ బి ఐ స్పష్టం చేసింది. అయితే, బల్క్ టర్మ్ డిపాజిట్లను గడువు ముందే విత్‌డ్రా చేసుకుంటే 1 శాతం పెనాల్టీ యథాతథంగా ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. చాలా బ్యాంకులు వడ్డీ రేట్లను తగ్గిస్తున్న తరుణంలో ఎస్‌బీఐ తీసుకున్న ఈ నిర్ణయం పెద్ద మొత్తంలో డిపాజిట్ చేయాలనుకునే వారికి, ముఖ్యంగా సీనియర్ సిటిజన్లకు మంచి లాభదాయకంగా మారనుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# ఆరునెలల వేతనాలు తక్షణమే చెల్లించాలి

**ప్రభుత్వాన్ని హెచ్చరించిన రామ రాజేష్ ఖన్నా**

**హనుమకొండ : (జై భీమ్ న్యూస్)**



ఐదు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని లేకుంటే ఈ నెల 29న ఇందిరాపార్క్ వద్ద ఉద్యోగులు అందరితో కలిపి మహాధర్నా చేస్తామని జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బుధవారం విలేకరులతో మాట్లాడారు...జాతీయ ఆరోగ్య మిషన్ లో నిధులు కింద కేంద్రం నుంచి ప్రతి 4 నెలల ఒకసారి 60% రాష్ట్రం నుంచి 40% నిధులు విడుదల చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 40% నిధులు ఆలస్యంగా విడుదలవుతుండడంతో ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందడంలేదన్నారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లో వర్క్ చేస్తున్నటువంటి మూడు కేటగిర్లకు వేతనాలు రాలేదు అనగా మెడికల్ ఆఫీసర్ అసిస్టెంట్ లేదా ఎం.ఎన్.ఓ.,వాచ్మేన్ మరియు స్వీపర్ సెప్టెంబర్ ,అక్టోబర్ జనవరి ,ఫిబ్రవరి మరియు మార్చి జీతాలు రాలేదు, ఓకే ఆసుపత్రిలో పనిచేస్తున్న పైన డాక్టర్లకు, నర్సులకు, ఫార్మసీ ఆఫీసర్లకు , ఏఎన్ఎం లకు , ల్యాబ్ టెక్నీషియన్లకు, వచ్చినప్పుడు మిగతా వారికి ఎందుకు రావు జీతాలు అని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాం, ఇంత ముందుకు ఒకటే రోజు ఒకే గంటలో అందరికీ వేతనాలు వచ్చేవి జీతాలు ఇప్పుడు ఈ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన కానుంచి ఇష్టం వచ్చినట్టు వేతనాలు ఇస్తున్నారు ఒకరికి ఇస్తున్నారు ఒకరికి ఇవ్వడం లేదు అలా కాకుండా ఒకటే రోజు అందరికీ పడేలా చూడాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నామన్నారు. పి.ఎఫ్.డబ్బులు గత ఆరు నెలల అనగా సెప్టెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు ఉద్యోగులకు జమ చేయడం లేదు కార్తికేయ సెక్యూరిటీ ఏజెన్సీ వ్యవస్థను రద్దుచేసి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని దానికి ఈ నెల 29న హైదరాబాద్ ఇందిరా పార్క్ లో మహాధర్నా నిర్వహిస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 2750 మందిని ఔట్సోర్సింగ్ పంపించిన ప్రభుత్వం యధావిధిగా కాంట్రాక్ట్ లోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తుంటే ఉద్యోగులను వారికి తెలియకుండానే ఏజెన్సీ వరకు అప్పజెప్పిన ప్రజా ప్రభుత్వం ఏజెన్సీ వ్యవస్థకు అప్పజెప్పింది ఏజెన్సీ వాళ్లను రద్దుచేసి యధావిధిగా కాంట్రాక్ట్ లోకి 2750 మందిని ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.పై సమస్యలను వెంటనే పరిష్కరించాలని తక్షణమే పెండింగ్లో ఉన్న వేతనాలు చెల్లించాలని ఈనెల 28వ తేదీలోపు పై సమస్యలను పరిష్కరించని ఎడల 29వ తేదీన హైదరాబాద్ ఇంద్ర పార్క్ లో మహాధర్నా నిర్వహిస్తామని తెలియజేశారు కావున ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

# పెన్షన్ వాలిడేషన్ యాక్ట్ రద్దు చేయాలి: పెన్షనర్ల ఆందోళన


**పెన్షన్ హక్కులపై కోతలు వద్దు- వాలిడేషన్ రద్దు మా డిమాండ్.**
**జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా వినతి పత్రం సమర్పణ.**



**మార్చి 25 జైభీమ్ ప్రతినిధి: (వరంగల్ /వర్ధన్నపేట)**

పెన్షన్ వాలిడేషన్ యాక్ట్ 2025ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వరంగల్ జిల్లా కేంద్రంలో పెన్షనర్లు భారీ నిరసన చేపట్టారు. ఎస్‌జిపిఏటి జిల్లా ఆధ్వర్యంలో వందలాది మంది పెన్షనర్లు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్రు సుధీర్ బాబు (జిల్లా ఇంచార్జి), జిల్లా ప్రధాన కార్యదర్శి గునిగంటి సాంబయ్య, మార్కెట్ కమిటీ అధ్యక్షులు నాగపురి సారయ్య నేతృత్వం వహించారు.ఈ సందర్భంగా సుధీర్ బాబు మాట్లాడుతూ, పెన్షనర్లను రెండు వర్గాలుగా విభజించి వారి హక్కులను హరించడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. గునిగంటి సాంబయ్య మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన హక్కులకు విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. నాగపురి సారయ్య మాట్లాడుతూ, ఈ చట్టం వల్ల పెన్షనర్లకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో పాల్గొన్న నాయకులు, పెన్షనర్లు వాలిడేషన్ చట్ట ప్రతులను చింపివేసి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. సుమారు 200 మంది సభ్యులు పాల్గొన్న ఈ ఆందోళనలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు మార్మోగాయి.అనంతరం జిల్లా కలెక్టర్ సత్యశారదకు మెమోరాండం అందజేసి, తమ డిమాండ్లను ప్రధానమంత్రికి పంపించాలని కోరారు. "పెన్షన్ హక్కులపై కోతలు వద్దు -- వాలిడేషన్ యాక్ట్ రద్దే మా డిమాండ్"

# క్రైస్తవ మతంలోకి మారితే ఎస్సీ హోదా రద్దే: సుప్రీంకోర్టు కీలక తీర్పు




**న్యూఢిల్లీ, 25 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

షెడ్యూల్డ్ కులాలకు (ఎస్సీ) చెందిన వ్యక్తి క్రైస్తవ మతంలోకి మారిన వెంటనే అతని ఎస్సీ హోదా పూర్తిగా రద్దవుతుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలాంటి వ్యక్తికి ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద రక్షణ కూడా వర్తించదని తేల్చి చెప్పింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు ధర్మాసనం సమర్థిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెంకు చెందిన పాస్టర్ చింతాడ ఆనంద్‌కు సంబంధించిన కేసు ఈ తీర్పుకు కారణమైంది. 2021లో తనపై దాడి జరిగిందని ఆరోపిస్తూ ఆనంద్, అక్కల రామిరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. ఐపీసీ సెక్షన్లు 341, 323, 506తో పాటు అట్రాసిటీ చట్టంలోని పలు సెక్షన్లు కూడా కేసులో చేర్చబడ్డాయి. దర్యాప్తు పూర్తయి చార్జిషీట్ కూడా దాఖలైంది. అయితే, ఫిర్యాదుదారు ఆనంద్ ఇప్పటికే క్రైస్తవ మతంలోకి మారి పాస్టర్‌గా సేవలందిస్తున్నందున అతను ఎస్సీ కిందకు రాడని పేర్కొంటూ రామిరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఈ వాదనను సమర్థిస్తూ, మతం మారిన వ్యక్తికి ఎస్సీ హోదా వర్తించదని స్పష్టం చేసి కేసును కొట్టివేసింది. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఆనంద్ సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ, అక్కడ కూడా హైకోర్టు తీర్పే నిలిచింది. సుప్రీంకోర్టు తన తీర్పులో 1950 నాటి రాష్ట్రపతి ఉత్తర్వులను ప్రస్తావిస్తూ, ఎస్సీ హోదా హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు చెందినవారికే పరిమితమని స్పష్టం చేసింది. క్రైస్తవం లేదా ఇస్లాం మతాలలోకి మారిన వారికి ఎస్సీ హోదా, రిజర్వేషన్లు, చట్టపరమైన రక్షణలు వర్తించవని తేల్చిచెప్పింది. కుల ధృవీకరణ పత్రం ఉన్నా, మత మార్పిడి జరిగిన వాస్తవం ముఖ్యమని పేర్కొంది. ధర్మాసనం మరో కీలక వ్యాఖ్యలో క్రైస్తవ మతంలో కుల వ్యవస్థకు స్థానం లేదని తెలిపింది. "క్రైస్తవ మతం అందరినీ సమానంగా చూడుతుంది. ఒక వ్యక్తి ఆ మతాన్ని స్వీకరించిన తర్వాత హిందూ సమాజంలోని కుల వివక్ష నుంచి బయటపడినట్టే భావించాలి. అలాంటి పరిస్థితిలో ఎస్సీ, ఎస్టీ చట్టం కింద రక్షణ కోరడం చెల్లదు" అని వ్యాఖ్యానించింది. ఇంకా, ఎస్సీ హోదాను ఇతర మతాలకు విస్తరించాలంటే పార్లమెంట్ చట్టం ద్వారా మాత్రమే సాధ్యమని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు లేదా కుల ధృవీకరణ పత్రాలు రాష్ట్రపతి ఉత్తర్వులను అధిగమించలేవని పేర్కొంది. ఈ తీర్పుపై ప్రత్యర్థి అక్కల రామిరెడ్డి స్పందిస్తూ, ఐదేళ్లుగా న్యాయపోరాటం చేశానని, తనపై అన్యాయంగా అట్రాసిటీ కేసు పెట్టారని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు న్యాయం జరిగిందనే ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు. ఈ తీర్పు దేశవ్యాప్తంగా మత మార్పిడి, కుల హోదాలు, చట్టపరమైన రక్షణలపై కీలక చర్చకు దారితీస్తోంది.

# భాగ్యనగరంలో ప్రయాణికులకు ఆర్టీసీ శుభవార్త

**హైదరాబాద్, జై బీమ్ న్యూస్**




భాగ్యనగరంలో ప్రయాణికులకు టీజీఎస్ఆర్టీసీ శుభవార్త చెప్పింది. హైదరాబాద్ నగర పరిధిలోని మెట్రో, ఏసీ డీలక్స్ బస్సుల్లో 30 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ప్రకటించింది. పెట్రోల్, డీజిల్ కొరత వార్తల నేపథ్యంలో ప్రయాణికులకు ఆర్టీసీ ఊరటనిచ్చే వార్త చెప్పింది. ఈ సందర్భంగా ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి స్పందిస్తూ, "పెట్రోల్ కష్టాలు పడటం ఎందుకు దండగ, ఆర్టీసీ బస్సులు ఉండగ" అంటూ వ్యాఖ్యానించారు. పెట్రోల్ బంకుల వద్ద ప్రజలు బారులు తీరవద్దని, సురక్షితంగా బస్సులోనే ప్రయాణించాలని సూచించారు.

# ఫోన్ పేలో 10వేలు.. స్క్రీన్‌షాట్‌తో బయటపడిన వ్యవహారం..!

**సివిల్ సప్లై అధికారి "కిరణ్ కుమార్" పై లంచం ఆరోపణలు?**
**ఏసీబీ విచారణకు డిమాండ్**
**పది వేలు సార్ నాకు పంపిండు..**
**నేను మళ్ళీ సార్ కు పంపిన అంటున్న అధ్యక్షుడు..**
**అధ్యక్షుడి ఫోన్ పే వివరాలు తనిఖీ చేస్తే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయి**

**వరంగల్ / జై భీమ్ న్యూస్ :**


వరంగల్ జిల్లాలో సివిల్ సప్లై శాఖలో సంచలన అంశం వెలుగులోకి వచ్చింది. ఒక సివిల్ సప్లై అధికారికి సంబంధించినట్లు చెప్పబడుతున్న ?10,000 ఫోన్ పే లావాదేవీ స్క్రీన్‌షాట్ బయటకు రావడం కలకలం రేపుతోంది. డీలర్ల వాదన ప్రకారం, రేషన్ డీలర్ అధ్యక్షుడి ద్వారా ఈ డబ్బులు ఫోన్ పేలో పంపించబడినట్లు ఆరోపిస్తున్నారు. ఈ లావాదేవీపై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, "ఈ డబ్బులు ఎందుకు తీసుకున్నారు?" అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇదే సమయంలో, డబ్బులు తీసుకున్న తర్వాత కూడా కేసులు నమోదు చేస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. దీంతో ఈ వ్యవహారం మరింత వివాదాస్పదంగా మారింది. ఇంకా, ఈ విషయంపై ప్రశ్నించినప్పుడు డిప్యూటీ తహశీల్దార్ స్థాయి అధికారి కిరణ్ కుమార్ స్పందించిన తీరు కూడా విమర్శలకు దారి తీసింది. "మీరు ఎవరు..? రిపోర్టర్ అయితే అక్రెడిటేషన్ కార్డు పంపండి" అంటూ అహంకారంగా మాట్లాడినట్లు సమాచారం.

**మండల అధ్యక్షుడి పాత్రపై అనుమానాలు**

ఈ వ్యవహారంలో ఖిలా వరంగల్ మండల రేషన్ డీలర్ అధ్యక్షుడు కీలకంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారితో కలిసి తనకు అనుకూలంగా లేని డీలర్లను టార్గెట్ చేస్తూ కక్ష సాధింపులకు పాల్పడుతున్నాడని బాధితులు చెబుతున్నారు.

**ఏసీబీ విచారణ అవసరం**

ఫోన్ పే లావాదేవీ స్క్రీన్‌షాట్ బయటకు రావడంతో, ఈ వ్యవహారంపై ఏసీబీ అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని డీలర్లు డిమాండ్ చేస్తున్నారు. "స్క్రీన్‌షాట్‌లో ఉన్న లావాదేవీ నిజమేనా..? దాని వెనుక కారణం ఏమిటి..? అన్నది వెలుగులోకి రావాలి. తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని వారు కోరుతున్నారు. ఇప్పుడు ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి నిజానిజాలు బయటపెడతారా..? లేక వ్యవహారం మళ్లీ ముసుగులోనే మిగిలిపోతుందా..? అన్నది చూడాలి.




# ఐనవోలు మండల కేంద్రంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్

**ప్రియదర్శిని యూత్ ఆధ్వర్యంలో యువతకు క్రీడా వేదిక**

**వరంగల్ / ఐనవోలు, మార్చి 25 ( జైభీమ్ ప్రతినిధి)**

యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ప్రియదర్శిని యూత్ ఆధ్వర్యంలో ఐనవోలు మండల కేంద్రంలో ఈ నెల 28న శనివారం జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు కార్యదర్శి సాంబారి శివకుమార్ వెల్లడించారు. ఈ టోర్నమెంట్‌కు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి జట్లు పెద్ద ఎత్తున పాల్గొననున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యతో పాటు క్రీడల్లోనూ యువత రాణించాలని, క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం పెంపొందడమే కాకుండా భవిష్యత్తులో అవకాశాలకు దారి తీసే సర్టిఫికెట్లు కూడా లభిస్తాయని పేర్కొన్నారు. యువత తమ ప్రతిభను చాటుకునేందుకు ఇలాంటి వేదికలు ఎంతో అవసరమని అన్నారు.

**నమోదు వివరాలు:**

పోటీల్లో పాల్గొనదలచిన జట్లు 9989415238 నంబర్‌ను సంప్రదించి తమ జట్టు పేరు, సభ్యుల వివరాలను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

**బహుమతులు**

మొదటి బహుమతి: ?25,016/-
ద్వితీయ బహుమతి: ?15,015/-
తృతీయ బహుమతి: ?7,016/-
మ్యాన్ ఆఫ్ ది సిరీస్: ?2,016/-

ప్రముఖుల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

**టోర్నమెంట్ నిబంధనలు**

ప్రతి మ్యాచ్ 10 ఓవర్లుగా నిర్వహణ
రెడ్ టెన్నిస్ బాల్‌తో పోటీలు
ఒక ఆటగాడు ఒకే జట్టుకు పరిమితం
మ్యాచ్‌కు 15 నిమిషాల ముందు హాజరు తప్పనిసరి

**ఎంపైర్ నిర్ణయం తుది**

గ్రౌండ్ సదుపాయాన్ని జంపాల సాయిలు, జంపాల రఘు అందిస్తుండగా, టోర్నమెంట్ మొత్తం నిర్వహణ బాధ్యతలను ప్రియదర్శిని యూత్ సభ్యులు చేపట్టనున్నారు. యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించే ఈ టోర్నమెంట్ విజయవంతం కావాలని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# హనుమకొండలో వయోజన విద్య పరీక్షలకు ఘన ఏర్పాట్లు

**26,510 మంది అభ్యర్థులు హాజరు**

**హన్మకొండ, 25 మార్చి 2026 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లాలో వయోజన విద్య విధానం (ఎన్ఐఓఎస్) పబ్లిక్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేసింది. విద్యకు మరో అవకాశం కల్పించే ఈ పరీక్షలను ఎటువంటి అవాంతరాలు లేకుండా, అభ్యర్థులకు సౌకర్యవంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తున్నాయి. సెప్టెంబర్ 2025 నుంచి మార్చి 2026 వరకు కొనసాగుతున్న ఈ పరీక్షలలో జిల్లాలో మొత్తం 26,510 మంది అభ్యర్థులు పాల్గొననున్నారు. మార్చి 29, 2026 నుంచి ప్రారంభమయ్యే ఈ పరీక్షలు జిల్లాలోని ఎంపీపీ పాఠశాలలు, జెడ్పీ హైస్కూళ్లు, ఈవో భవనాలు, గ్రామపంచాయతీ కార్యాలయాలు వంటి కేంద్రాలలో నిర్వహించబడతాయి. ప్రతిరోజూ ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. పరీక్షల సజావు నిర్వహణ కోసం డిఆర్డిఓ, డిఆర్డిఎ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించగా, హసన్‌పర్తి కేంద్రంగా అన్ని ఏర్పాట్లను సమన్వయం చేశారు. ఈ సమావేశంలో సెర్ప్ సిబ్బంది, జిల్లా అధికారులు పాల్గొని పరీక్షల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతా చర్యలు, అభ్యర్థులకు అందించాల్సిన సౌకర్యాలపై విస్తృతంగా చర్చించారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించారు. బయోమెట్రిక్ నమోదు, హాల్ టికెట్ల పంపిణీ, భద్రత, పరిశుభ్రత వంటి అంశాల్లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. అభ్యర్థుల రాకపోకలను సులభతరం చేయడానికి ప్రతి అభ్యర్థికి రూ.150 ప్రయాణ భత్యం అందించనున్నారు. అదనంగా మండల స్థాయిలో అవసరమైన సదుపాయాల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించారు. అభ్యర్థుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి పరీక్షా కేంద్రానికి సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పిహెచ్సి) ద్వారా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే తాగునీరు, మరుగుదొడ్లు, కూర్చోవడానికి సరైన వసతులు వంటి మౌలిక సదుపాయాలను కూడా కల్పిస్తున్నారు. డిఆర్డిఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, పరీక్షల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా ప్రతి కేంద్రంలో సమగ్ర పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. అభ్యర్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు, పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అధికార యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తోందన్నారు. డీపీఎంలు దయాకర్, పద్మప్రియ, సరిత, అనిత మాట్లాడుతూ, వయోజన విద్య ద్వారా చదువు కొనసాగించేందుకు ముందుకు వచ్చిన అభ్యర్థులకు ఈ పరీక్షలు కీలకమైన అవకాశమని పేర్కొన్నారు. అభ్యర్థులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు రాయడానికి ప్రతి స్థాయిలో చర్యలు తీసుకున్నామని తెలిపారు. అన్ని కేంద్రాల్లో సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ, పరీక్షలు సజావుగా జరిగేలా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంలు దాసరి నారాయణ, లలిత, కవిత, రవీందర్, నాగేశ్వర్, అశోక్, వేణుగోపాల్, వేణు తదితర సీసీలు పాల్గొన్నారు. మొత్తం మీద వయోజన విద్యకు ప్రాధాన్యత ఇస్తూ, అభ్యర్థులకు అనుకూల వాతావరణంలో పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.





# పెట్రోల్, డీజిల్ కొరత లేదు

**వదంతులను నమ్మవద్దు**
**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

**వరంగల్, 25 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని వరంగల్ సీపీ స్పష్టం చేశారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న వదంతుల వల్ల ప్రజలు ఆందోళనకు గురై ఒకేసారి పెద్ద సంఖ్యలో పెట్రోల్ బంకులకు వెళ్లి వాహనాల్లో ఫుల్ ట్యాంక్ నింపించుకుంటున్నారని తెలిపారు. దీంతో అనవసర రద్దీ ఏర్పడి సరఫరా వ్యవస్థకు అంతరాయం కలుగుతున్నదని పేర్కొన్నారు. వరంగల్ కమిషనరేట్ అన్ని పెట్రోల్ బంకుల్లో సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని, సరఫరా నిరంతరంగా కొనసాగుతున్నదని చెప్పారు. ఎటువంటి కొరత పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ప్రజలు అవసరానికి మించి ఇంధనం నిల్వ చేసుకోవద్దని, అలా చేయడం వల్ల ఇతరులకు ఇబ్బందులు కలుగుతాయని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మకూడదని, నిర్ధారించని సమాచారాన్ని షేర్ చేయడం ద్వారా గందరగోళం సృష్టించవద్దని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు అప్రమత్తంగా ఉన్నారని, వదంతులు వ్యాప్తి చేయడం లేదా ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.




# బడుగు బలహీనుల పక్షాన కాంగ్రెస్

**సొంతింటి కల సాకారం వైపు అడుగులు**
**ఇందిరమ్మ ఇళ్లతో పేదల జీవితాల్లో వెలుగు.**
**వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**



**మార్చి 25 జైభీమ్ ప్రతినిధి: (వరంగల్ /వర్ధన్నపేట)**

బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికే కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు స్పష్టం చేశారు. అసెంబ్లీలో మాట్లాడిన ఆయన, కాంగ్రెస్ అంటేనే పేదల పార్టీ అని పేర్కొంటూ, ఇందిరమ్మ రాజ్యంలోనే పేదల సొంతింటి కల నిజమవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆత్మగౌరవంతో జీవించాలంటే సొంత ఇల్లు అవసరమని పేర్కొన్న ఎమ్మెల్యే, ప్రజా ప్రభుత్వంలో పేదలకు ఇండ్లు కల్పించేందుకు పెద్దపీట వేస్తున్నామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో లబ్ధిదారుల కళ్లల్లో కనిపించే ఆనందం తనకు అపారమైన సంతృప్తిని ఇస్తోందని అన్నారు. గృహప్రవేశాల సందర్భంగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రంతో ఇళ్లలోకి ప్రవేశించడం గర్వకారణమని పేర్కొన్న ఆయన, ప్రతి పౌరుడికి కూడు, గూడు, నీడ కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అని స్పష్టం చేశారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో దళితుల సంఖ్య అధికంగా ఉందని గుర్తుచేసిన ఎమ్మెల్యే, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే స్థోమత లేని వారికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రైవేట్ సంస్థ సహకారంతో 25 ఇళ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లినట్లు వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ జనాభా అధికంగా ఉన్న ప్రాంతాలకు ఎక్కువ ఇళ్లు కేటాయిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని చెప్పారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వర్ధన్నపేట ప్రజల తరపున ఎమ్మెల్యే నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు.

# తెలంగాణలో ఇంధన కొరత లేదు

**వదంతులను నమ్మొద్దు: సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర**



**హైద్రాబాద్, 25 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా పెట్రోల్, డీజిల్ కొరత లేదని సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. ఇటీవల సోషల్ మీడియాలో ఇంధన కొరతపై వస్తున్న వదంతులను ప్రజలు నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఇంధన సరఫరా సజావుగా కొనసాగుతోందని, ఆయిల్ కంపెనీల వద్ద తగినంత నిల్వలు ఉన్నాయని తెలిపారు. బంక్‌లకు నిన్న ఒక్కరోజే సుమారు 1,500 పెట్రోల్, డీజిల్ ట్యాంకర్ల ద్వారా సరఫరా జరిగిందని వెల్లడించారు. రోజువారీ అవసరాలకు సరిపడా ఇంధనం అందుబాటులో ఉందని చెప్పారు. వాహనదారులు అనవసరంగా ఆందోళన చెందకుండా, పెట్రోల్, డీజిల్‌ను అధికంగా నిల్వ చేసుకోవద్దని సూచించారు. వదంతుల కారణంగా బంక్‌ల వద్ద రద్దీ పెరగకుండా సహకరించాలని కోరారు. ప్రజలు అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా రాష్ట్రంలో ఇంధన సరఫరా కొనసాగుతుందని స్టీఫెన్ రవీంద్ర తెలిపారు.

# హనుమకొండలో జర్నలిస్ట్ అదృశ్యం

**పోలీసుల గాలింపు ముమ్మరం**

**హన్మకొండ, 25 మార్చి 2026 (జై బీమ్ న్యూస్)**





హనుమకొండలో ఓ జర్నలిస్ట్ అనుమానాస్పదంగా అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పూజారి విజయ్ కుమార్ (50), తండ్రి సాంబయ్య, కృష్ణ కాలనీ నివాసి, వృత్తిరీత్యా జర్నలిస్ట్. మంగళవారం (మార్చి 24) ఉదయం సుమారు 7:30 గంటల సమయంలో తన చిన్న కూతురిని హనుమకొండ బస్టాండ్ వద్ద దింపేందుకు తన టూవిల్లర్ (టూ03ఈవి2731)పై వెళ్లిన విజయ్ కుమార్ అనంతరం ఇంటికి తిరిగి రాలేదు. అతని మొబైల్ ఫోన్‌కు కాల్ చేయగా స్విచ్ ఆఫ్‌గా వస్తుండడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఈ విషయమై ఆయన అన్న పూజారి శ్రీనివాస్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు కేయూసి ఇన్స్పెక్టర్ ఎస్. రవి కుమార్ తెలిపారు. విజయ్ కుమార్ ఆచూకి తెలిసిన వారు వెంటనే కుటుంబ సభ్యులకు (ఫోన్: 9652988566, 9490519691) లేదా పోలీసులకు (ఫోన్: 8712685004, 8712685115, 8712685089, 8712685088) సమాచారం అందించాలని పోలీసులు కోరుతున్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# గ్రామ ప్రథమ పౌరుడి దాష్టికం

**యువత భవిష్యత్తుతో చెలగాటం!**
**మార్గం చూపాల్సిన సర్పంచే మద్యం దందాకు అడ్డాగా మారాడా?**
**గ్రామ ప్రజల్లో కట్టలు తెచ్చుకుంటున్న ఆగ్రహం**

**మార్చి 25 జైభీమ్ ప్రతినిధి: (వరంగల్ /వర్ధన్నపేట)**

గ్రామ అభివృద్ధికి మార్గదర్శకుడిగా ఉండాల్సిన ప్రథమ పౌరుడే యువత భవిష్యత్తుతో ఆటలాడుతున్నాడనే ఆరోపణలు వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలో కలకలం రేపుతున్నాయి. గ్రామ ప్రజల నమ్మకాన్ని అందిపుచ్చుకుని సర్పంచ్‌గా గెలిచిన వ్యక్తి, ఇప్పుడు అదే ప్రజల విశ్వాసాన్ని వమ్ము చేస్తున్నాడనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామంలో అక్రమంగా సాగుతున్న బెల్ట్ మద్యం వ్యాపారాన్ని అరికట్టాల్సిన బాధ్యత అతనిదే కాగా, అదే వ్యాపారానికి అతడే ప్రోత్సాహకుడిగా మారాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. యువతను మంచి మార్గంలో నడిపించాల్సిన నాయకుడే, మద్యం అలవాట్లకు బానిసలుగా మార్చుతున్నాడని గ్రామ పెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మద్యం విక్రయాలతో సంబంధం ఉన్న వ్యక్తినే, మార్పు వస్తుందనే నమ్మకంతో సర్పంచ్‌గా ఎన్నుకున్నామని గ్రామస్తులు చెబుతున్నారు. అయితే ఇప్పుడు అదే వ్యక్తి మళ్లీ పాత దారిలో నడుస్తూ గ్రామంలో బెల్ట్ షాపుల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్నాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల గ్రామంలో మద్యం దందా పెరగడంతో యువతపై ప్రతికూల ప్రభావం పడుతోందని, కుటుంబాల్లో కలహాలు పెరుగుతున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ అభివృద్ధి పక్కనపెట్టి అక్రమాలకు పాల్పడటం తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రజలు చెబుతున్నారు. "ఇప్పటికైనా మారాలి... యువత భవిష్యత్తుకి బాటలు వేయాలి"అని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే విచారణ చేపట్టి, అక్రమ మద్యం దందాపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.




# తెలంగాణ విద్యా కమిషన్ సూచనల్లో సవరణలు చేయాలి: పి.డి.ఎస్.యు




**హన్మకొండ, 25 మార్చి 2025(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చేసిన సూచనల్లో కొన్నింటిని సవరించాలని పి.డి.ఎస్.యు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. నరసింహరావు డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కాకతీయ యూనివర్సిటీ ఎస్.డి.ఎల్.సి.ఇ.లోని సైకాలజీ విభాగంలో భారత జాతీయోద్యమ వీరులు షాహిద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల 95వ వర్ధంతి సందర్భంగా స్మారక వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నరసింహరావు, దేశంలో కుల, మత, ఆర్థిక అసమానతలు లేని సమాజం కోసం ప్రాణాలు అర్పించిన వీరుల పోరాట స్ఫూర్తిని విద్యార్థులు, యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యారంగంపై నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నాయని ఆయన విమర్శించారు. విద్యారంగానికి తగిన నిధులు కేటాయించకపోవడం వల్ల విద్యా వ్యవస్థ సంక్షోభంలో పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ సూచనల్లో కొన్ని విద్యార్థుల సంక్షేమానికి అడ్డంకిగా మారే అవకాశముందని పేర్కొంటూ వాటిని పునఃసమీక్షించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పేద విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలోని ప్రతి విశ్వవిద్యాలయానికి రూ.1000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి అభివృద్ధి చర్యలు చేపట్టాలని, యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్-టీచింగ్ పోస్టులను శాశ్వతంగా భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. వరంగల్-హన్మకొండ జిల్లా అధ్యక్షుడు బోయినపల్లి అజయ్, రాష్ట్ర గర్ల్స్ కో-కన్వీనర్ పి. అనూష, రాష్ట్ర నాయకులు దండు వినయ్, కె.యు. నాయకులు లోకేష్, ప్రవర్ధన్, శివకుమార్, దేవా, పూజిత, రమ్య, తేజస్విని, ప్రతాప్, ధర్మ, సోనీ, అమూల్య, మాళవిక తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి అదృశ్యం

**కేసు నమోదు, గాలింపు ముమ్మరం**

**హన్మకొండ, 25 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**



హనుమకొండలో ఓ యువ విద్యార్థి అనుమానాస్పదంగా అదృశ్యమైన ఘటన కలకలం రేపుతోంది. చింతగట్టు ప్రాంతానికి చెందిన గుగులోతు రాజేంద్ర ప్రసాద్ (22) అనే విద్యార్థి మార్చి 18న ఉదయం నుంచి కనిపించకుండా పోయినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు, ఆ రోజు ఉదయం వారు నర్సంపేటకు వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చేసరికి రాజేంద్ర ప్రసాద్ ఇంట్లో లేకపోవడంతో అనుమానం వ్యక్తమైంది. అతని మొబైల్ ఫోన్‌కు కాల్ చేయగా స్విచ్ఛాఫ్‌గా వస్తోందని, కొన్నిసార్లు ఫోన్ ఆన్ చేసి మళ్లీ ఆఫ్ చేస్తున్నట్లు గుర్తించినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. దీంతో అతని ఆచూకి తెలియక ఆందోళన చెందిన తల్లి గుగులోతు విజయ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు కేయూసి ఇన్స్పెక్టర్ ఎస్. రవి కుమార్ తెలిపారు. యువకుడి ఆచూకి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. రాజేంద్ర ప్రసాద్ గురించి ఎవరైనా సమాచారం తెలిసిన వారు వెంటనే పోలీసులను సంప్రదించాలని అధికారులు కోరుతున్నారు. ఇందుకోసం పోలీస్ కంట్రోల్ నంబర్లు విడుదల చేశారు ?? 8712685004, 8712685115, 8712685089, 8712685088. ఈ ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కుటుంబ సభ్యులు యువకుడు సురక్షితంగా తిరిగి రావాలని కోరుకుంటున్నారు.

# ఆచార్య నాగిశెట్టి లింగమూర్తి దశదిన కర్మలో పాల్గొన్న వైస్ ఛాన్సలర్ ఇతరులు



**హన్మకొండ, 25 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

మాజీ వైస్ ఛాన్సలర్, అర్థశాస్త్ర విభాగ ఆచార్యులు దివంగత ఆచార్య నాగిశెట్టి లింగమూర్తి దశదిన కర్మ సందర్భంగా ఆయన స్వగృహాన్ని కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఆచార్య లింగమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# వెనుకబడిన కులాల అభివృద్ధికి వాహన రుణాలు

**జిల్లాలో దరఖాస్తుల ఆహ్వానం**



**హన్మకొండ, 25 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

జిల్లాలోని వెనుకబడిన కులాల ఆర్థికాభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని జిల్లా వెనుకబడిన కులాల సేవా సహకార అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి సంబంధించి "వ్యక్తిగత కులాల వ్యాపార ప్రోత్సాహక పథకం" కింద లబ్ధిదారుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. ఈ పథకం ద్వారా టూ వీలర్స్, ఈ-ఆటోలు, ప్యాసింజర్ వాహనాల కొనుగోలుకు ఆర్థిక సహాయం అందజేస్తారు. టూ వీలర్ వాహనాలకు రూ.1 లక్ష వరకు, ఈ-ఆటోలకు రూ.3 లక్షల వరకు సబ్సిడీతో రుణ సౌకర్యం కల్పించనున్నారు. జొమాటో, స్విగ్గీ, రాపిడో, ఉబర్ వంటి ఆన్‌లైన్ సేవలతో అనుసంధానం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా అధికారులు పేర్కొన్నారు. అదేవిధంగా టైలరింగ్, డ్రైవింగ్, పశుసంవర్ధక, హార్టికల్చర్, సెరికల్చర్ రంగాల్లో కూడా రుణ సదుపాయాలు అందుబాటులో ఉంటాయి. దరఖాస్తుదారుల అర్హతల విషయానికి వస్తే, గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ.1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు మించరాదు. అభ్యర్థుల వయస్సు సాధారణంగా 21 నుండి 50 సంవత్సరాల మధ్య ఉండాలి. పశుసంవర్ధక రంగానికి సంబంధించిన వారికి 21 నుండి 60 సంవత్సరాల వరకు అవకాశం కల్పించారు. దరఖాస్తు చేసుకునే వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రం, కుల ధృవీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ పాస్‌బుక్, ఫోటోలు తదితర పత్రాలను సమర్పించాలి. ఆసక్తి గల అభ్యర్థులు ఫ్రైజూం:7/స్త్రశీఎ-ఎఎంఅవష.ఎ్స్త్ర.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. దరఖాస్తుల చివరి తేదీ 02 ఏప్రిల్ 2026గా నిర్ణయించగా, ఎంపికైన అభ్యర్థులకు సంబంధిత అధికారుల ద్వారా సమాచారం అందజేయబడుతుంది. అర్హులైన యువత ఈ అవకాశాన్ని వినియోగించుకుని స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని అధికారులు సూచించారు.

# కేయూసిఈ అండ్ టిలో ఎన్ఎస్ఎస్ శిబిరం

**మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం**

**హన్మకొండ, 25 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**



కాకతీయ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ మరియు టెక్నాలజీ కళాశాల (కేయూసిఈ అండ్ టి)లో నిర్వహిస్తున్న 7 రోజుల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం సందర్భంగా "ఈగుల్ ఫోర్స్" తెలంగాణ సహకారంతో మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్. రమణ, ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారులు డాక్టర్ డి. శైలజ, డాక్టర్ ఎం. సౌజన్య మాట్లాడుతూ మత్తు రహిత సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. వరంగల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీకాంత్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వ్యసనానికి దారితీసే కారణాలు, వాటి వల్ల కలిగే శారీరక మరియు మానసిక నష్టాలను వివరించారు. అలాగే వ్యసనాన్ని అధిగమించే మార్గాలు, అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# కాకతీయ విశ్వవిద్యాలయంలో ఆధునిక ల్యాబ్ ప్రారంభం

**విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు**



**హన్మకొండ, 25 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

"ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక"లో భాగంగా కాకతీయ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ విభాగంలో ల్యాబ్‌ను ఆధునికీకరించినట్లు విభాగాధిపతి డాక్టర్ బి. రమ తెలిపారు. ఈ ఆధునిక ల్యాబ్‌ను బుధవారం ఉదయం విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా విభాగంలో ఇప్పటికే ఉన్న 30 కంప్యూటర్లకు తోడు, రిజిస్ట్రార్ నిధులతో మరో 30 కొత్త కంప్యూటర్ సిస్టమ్స్‌ను సమకూర్చి అదనపు ల్యాబ్‌ను కూడా ఆధునికీకరించారు. అలాగే, డాక్టర్ బి. రమ మరియు డాక్టర్ మంజులలకు మంజూరైన రుసా నిధుల ద్వారా అవసరమైన ఆధునిక పరికరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మొత్తం పనులకు సుమారు రూ. 30 లక్షలు వ్యయం అయినట్లు వెల్లడించారు. ప్రస్తుతం విభాగంలో ఎంసీఏ, ఎంఎస్సీ (కంప్యూటర్ సైన్స్) కోర్సుల్లో సుమారు 240 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారని, ఈ నూతన సదుపాయాలు వారి రోజువారీ తరగతులు, ప్రాక్టికల్స్‌కు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ఇకపోతే, విభాగంలో ఉన్న పాత కంప్యూటర్లను రిజిస్ట్రార్ ఆదేశాల మేరకు అవసరమున్న ఇతర విభాగాలకు పంపిణీ చేసి, వాటి అవసరాలను తీర్చనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, దూర విద్య కేంద్ర సంచాలకులు ఆచార్య బి. సురేష్ లాల్, ఆచార్య ఆర్. మల్లికార్జున రెడ్డి, డీన్ ఆచార్య జి. హనుమంతు, విభాగ అధ్యాపకులు డాక్టర్ మంజుల, డాక్టర్ రమేష్, డాక్టర్ సలోని ఫాతిమా, డాక్టర్ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డికి దమ్ముంటే నాపై పోటీకి రావాలి: హరీశ్ రావు సవాల్

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు విమర్శల వర్షం కురిపించారు. రేవంత్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతానని పగటి కలలు కంటున్నారని, ఆయన తల్లకిందులుగా తపస్సు చేసినా అది అసాధ్యమని ఎద్దేవా చేశారు. తమ పార్టీకి ఎప్పుడు, ఎలా గోల్ కొట్టాలో బాగా తెలుసని, సమయం వచ్చినప్పుడు బీఆర్ఎస్ సత్తా ఏంటో చూపిస్తామని అన్నారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే వేరే వాళ్లను పంపడం కాకుండా, నేరుగా సిద్దిపేటలో తనపై పోటీకి రావాలని బహిరంగ సవాల్ విసిరారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో పాటు రైతులను కూడా దారుణంగా మోసం చేసిందని హరీశ్ రావు ధ్వజమెత్తారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైన రేవంత్ సర్కారుపై ఇప్పటికే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని ఆయన విశ్లేషించారు. ఇదే సమయంలో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అంశాలపై స్పందిస్తూ, తాము ఈ మార్పులను స్వాగతిస్తున్నామని తెలిపారు. పునర్విభజన వల్ల భవిష్యత్తులో బీఆర్ఎస్ పార్టీకే రాజకీయంగా మేలు జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే, కుటుంబ నియంత్రణను పక్కాగా పాటించినందుకు దక్షిణాది రాష్ట్రాలకు సీట్ల కేటాయింపులో, నిధుల్లో అన్యాయం జరగడంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన సీనియర్ నేత జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలోకి వస్తారనే ప్రచారంపై హరీశ్ రావు ఆసక్తికరంగా స్పందించారు. ఆయన వస్తారా లేదా అనేది ఇప్పుడే చెప్పడం కంటే, వేచి చూస్తేనే బాగుంటుందని వ్యాఖ్యానించారు.

HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM